5లక్షల జనాభా.. రోజూ లక్షమంది యాత్రికుల తాకిడి ఉండే నగరం తిరుపతి. ఐదేళ్లు గందరగోళంగా మారిన నగర వ్యవస్థను గాడిలో పెట్టడం పెద్ద సవాలు. తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్‌గా నారపరెడ్డి మౌర్య ఆ సవాలును స్వీకరించారు. ఆర్థిక సమస్యలు అధిగమిస్తూ, ప్రజాప్రతినిధులనూ, అధికార యంత్రాంగాన్నీ సమన్వయం చేసుకుంటూ సాగుతున్నారు. నగరపాలక సంస్థ సారథిగా బాధ్యతలు చేపట్టి నేటికి సరిగ్గా ఏడాది అయిన సందర్భంగా కమిషనర్ మౌర్యతో ఆంధ్రజ్యోతి సంభాషణలోని ముఖ్యాంశాలు..

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



తిరుపతి నగర కమిషనర్‌గా మౌర్య బాధ్యతలు చేపట్టి నేటితో ఏడాది

■ ఇంటర్వ్యూ

తిరుపతి తీరు మారుతోంది

● యూడీఎస్, సీవోసీ, ప్రతిరోజూ తాగునీరు లక్ష్యాలు

? సవాలుగా స్వీకరించిన బాధ్యత

! రాయలసీమలోనే అత్యంత ప్రాధాన్యం ఉన్న వేడుక తిరుపతి గంగ జాతర. ఆ బాధ్యతలను నాకు అప్పగించారు. నాలుగు నెలలముందే వైకుంఠం టోకెన్ల జారీ సమయంలో తొక్కిసలాట ఘోరం కళ్లముందు మెదుల్తూనే ఉంది. అన్ని విభాగాలతో సమన్వయ సమావేశాలు నిర్వహించాను. చాటింపు రోజు నుంచి కంకణం కట్టుకున్నట్టుగా గంగమ్మ ఆలయంలోనే తిష్టవేసి కూర్చున్నా. సీసీ కెమెరాలను పరిశీలిస్తుండేదాన్ని. వీఐపీ పాసులను రద్దుచేశాం. ఉత్సవ కమిటీ సభ్యుల సపరివార సమేత హడావుడిని తగ్గించా. జాతర చివరి రెండు రోజులు గర్భగుడిలోకి అర్చకేతరులను అనుమతించలేదు. ఒకవైపు కార్పొరేషన్, తుడా బాధ్యతలు చూస్తూ, మరో వైపు జాతరలో ఓ భక్తురాలిగా పొంగళ్లు పెట్టి, సారెలు ఇస్తూ భక్తుల అవసరాలను అడిగి తెలుసుకుంటూ జాతరను జయప్రదం చేయడంలో ప్రధాన భూమిక పోషించానన్న సంతృప్తి కలిగింది.

? పన్నుల వసూళ్లు

! పన్నుల వసూళ్లలో తిరుపతి నగరపాలక సంస్థ రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచింది. 2023-24లో రూ.84కోట్లు మాత్రమే వసూళ్లు కాగా, ఈసారి వంద కోట్ల మార్కు దాటింది. 2024 వరకు ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ టెండరు రూ.2.58కోట్లు మాత్రమే. అదిప్పుడు జీఎస్టీతో కలిపి దాదాపు రూ.5కోట్లకు పెరిగింది.

? టీడీఆర్ బాండ్లపై ప్రజల్లో అసంతృప్తి ఉంది.

! నేను బాధ్యతలు తీసుకునే ముందు టీడీఆర్ బాండ్ల అవకతవకలపై గందరగోళ పరిస్థితులు ఉండేవి. ఓవైపు విజిలెన్స్ విచారణ జరుగుతోంది. మరో వైపు టీడీఆర్ మేళా ద్వారా పరిశీలన చేసి నిజమైన లబ్ధిదారులకు బాండ్లు అందజేశాం. ఇప్పటివరకు 242 మందికి బాండ్లు ఇచ్చాం.

? ఏడాదిలో ఏమేం చేశారు.

! రూ.30కోట్లతో 267 అభివృద్ధి పనులను చేపట్టాం. కొత్తరోడ్లు, ప్యాచ్‌వర్కులు, కాలువల్లో పూడికతీత, తాగునీటి పైపులైన్ల మరమ్మతులు వంటి పనులు జరిగాయి. మరో రూ.30కోట్లతో 50 పనులు టెండరు దశలో ఉన్నాయి. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కొర్లగుంట సర్కిల్ (ఆరోక్య ఫార్మసీ) డ్రైనేజీ సమస్యను పరిష్కరించాం. ఎమ్మార్ పల్లిలో యాచకులకు పునరావాస కేంద్రం ఏర్పాటుచేశాం.

ఇవి చేయబోతున్నాం!

- కేంద్ర ప్రభుత్వ ప్రజారోగ్య, పర్యావరణ ఇంజనీరింగ్ సంస్థ (చెప్కో) తిరుపతిలో యూడీఎస్ ప్రక్షాళనకు దాదాపు రూ.90కోట్లు వెచ్చించేందుకు ముందుకొచ్చింది. ట్రీట్‌మెంట్ ప్లాంట్ ద్వారా మురుగునీటిని శుద్ధి చేసి వ్యవసాయానికి వినియోగించేలా చర్యలు చేపడుతున్నాం.
- మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణ పనులు నేను బాధ్యతలు తీసుకునేప్పటికి పాతిక శాతం కూడా జరగలేదు. 8 నెలల్లోనే 70 శాతం పూర్తి చేశాం. మరో 8 నెలల్లో పూర్తి చేస్తాం.
- స్కావెంజర్స్ కాలనీకి రంగులు వేయడమే కాదు. వారి జీవితాలను రంగులమయం చేయాలని వుంది.
- తిరుపతిని వెడ్డింగ్ డెస్టినేషన్‌గా మార్చాలని ఇటీవల తిరుపతి పర్యటనలో సీఎం చెప్పారు. ఆ దిశగా ప్రణాళికలు జరుగుతున్నాయి. పెళ్లిళ్లు, జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు అవసరమైన అన్ని హంగులు మరో రెండేళ్లలో తిరుపతికి రానున్నాయి.
- మరో రూ.50కోట్లతో నగరమంతా ప్రతి రోజూ నీరు ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.
- శ్రీనివాసం సమీపంలో ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేయనున్నాం.
- లీలామహల్ వద్ద ఉన్న ఫిష్ మార్కెట్‌ను రేణిగుంట రోడ్డులోని ఓ మాస్టర్ ప్లాన్ రోడ్డు వద్దకు మార్చబోతున్నాం.
- స్ట్రీట్ వెండింగ్‌పై సర్వే చేసి కార్డులు ఇచ్చి వెండింగ్ జోన్‌లు పెట్టడం వల్ల ఫుట్‌పాత్ ఆక్రమణలు తగ్గించబోతున్నాం.



జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మంత్రి అనగాని సత్యప్రసాద్ తదితరులు

సెప్టెంబరు 14, 15 తేదీల్లో

జాతీయ మహిళా సాధికారత సదస్సు

● తిరుపతి వేదికగా నిర్వహణ ● హాజరుకానున్న 300మందికి పైగా మహిళా ప్రజాప్రతినిధులు
● ఏర్పాట్లు పక్కాగా ఉండాలంటూ అధికారులకు స్పీకర్ ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), జూలై 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని తాజ్‌హోటల్‌లో సెప్టెంబరు 14, 15 తేదీల్లో జాతీయ మహిళా సాధికారత సదస్సు (చట్టసభల జాతీయ మహిళా సాధికార సభ్యుల సదస్సు) నిర్వహిస్తున్నట్లు అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చెప్పారు. తిరుపతి కలెక్టరేట్‌లో బుధవారం డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి సదస్సు నిర్వహణపై జిల్లా యంత్రాంగంతో సమీక్షించారు. దేశంలోని 31 అసెంబ్లీలలో మహిళా కమిటీలు ఉన్నాయన్నారు. ఈ కమిటీల ద్వారా అనేక సమస్యలపై చర్చలు జరుగుతుంటాయని తెలిపారు. ప్రతి సమస్యను స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పరిష్కరించాలంటే కష్టమైన పనని, అందుకోసమే ఇలాంటి సదస్సులు నిర్వహించి అందులో చర్చా విధానాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వివరించారు. ఈ నేపథ్యంలోనే చట్టసభల జాతీయ మహిళా సాధికారత సభ్యుల సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తొలుత విశాఖలో నిర్వహించాలని అనుకున్నా.. శ్రీవారు కొలువైన తిరుపతిలో నిర్వహించాలని పార్లమెంట్ స్పీకర్ ఓంబిర్లా సూచించారన్నారు. ఎప్పటికీ గుర్తుండిపోయేలా సెప్టెంబరు 14, 15 తేదీలలో తిరుపతిలో పార్లమెంటరీ, లెజిస్లేటివ్ కమిటీ ఆన్ ఎంపవర్ ఆఫ్ ఉమెన్స్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కమిటీకి ప్రతి రాష్ట్రం నుంచి ఆరుగురు.. ప్రతి అసెంబ్లీ నుంచీ ఆరుగురు చొప్పున మహిళా ప్రజాప్రతినిధులు తాజ్ హోటల్‌లో జరిగే ఈ సదస్సుకు హాజరవుతారన్నారు. ఇలా 300మందికిపైగా హాజరయ్యే సభ్యులు రెండు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి ఆ నివేదికను పార్లమెంటు, అసెంబ్లీ ద్వారా తీసుకెళ్తారని అయ్యన్నపాత్రుడు తెలిపారు. 'సదస్సు అనంతరం తిరుమల, శ్రీకాళహస్తి, శ్రీసిటీ, శ్రీహరికోట, చంద్రగిరి కోటను సభ్యులు సందర్శిస్తారు. క్షేత్రస్థాయి పరిశీలన చేస్తారు. సదస్సు, వీరి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి' అని సూచించారు.



స్పీకర్‌ను సత్కరించి జ్ఞాపిక బహూకరిస్తున్న కలెక్టర్

మహిళాభ్యున్నతికి సీఎం కృషి

సీఎం చంద్రబాబు నాయుడు మహిళాభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు తెలిపారు. ఎక్కడా లేనివిధంగా చట్టసభల్లో, పదవుల కేటాయింపులో మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. తిరిగి 15 రోజుల తర్వాత మళ్లీ సమీక్షిస్తామన్నారు. వచ్చే కమిటీ సభ్యులకు బస, వసతి ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు, ఈవో శ్యామలరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డి, నెలవల విజయశ్రీ, ఆదిమూలం, రామకృష్ణ, శాప్ చైర్మన్ రవినాయుడు, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, కమిషనరు మౌర్య, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు నరసింహయాదవ్, సుగుణమ్మ, సదాశివం, హరిప్రసాద్, టీడీపీ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎం, సినీ హీరో పవన్ కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' సినిమాను బుధవారం రాత్రి తిరుపతిలో ప్రదర్శించారు. ఈ ఫ్యాన్స్ షో సందర్భంగా గ్రూప్ థియేటర్స్ వద్ద సందడి కనిపించింది. అభిమానులు, జనసైనికులు టపాసులు కాల్చి, పవన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి, కర్పూర హారతులిచ్చి తమ అభిమానం చాటారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

కళ్లు చెదిరే కళాకృతులు

● శిక్షణ దశలోనే విద్యార్థుల నైపుణ్య ప్రతీకలు
● టీటీడీ శిల్పకళాశాలలో అలరిస్తున్న కళారూపాలు

- వివరాలు 8లో -



జాతీయ భద్రతపై సెమినార్‌కు కలెక్టర్

తిరుపతి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ భద్రతపై కేంద్ర ప్రభుత్వం సెప్టెంబరు 15నుంచి 19వ తేదీ వరకూ నిర్వహించనున్న సెమినార్‌కు కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరు కానున్నారు. హైదరాబాదులోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో జరిగే ఈ సెమినార్‌కు ఏపీ నుంచీ ప్రభుత్వం ఆయన్ను డెప్యుటేట్ చేసింది. దీనికోసం ఆయన సెప్టెంబరు 12వ తేది రిలీవ్ అయి.. 14న అకాడమీలో రిపోర్టు చేసుకుని, ఐదు రోజుల కార్యక్రమం పూర్తయ్యాక 20 లేదా 21న తిరిగి కలెక్టర్‌గా జిల్లాలో విధుల్లో చేరనున్నారు.

తలకోన సిద్ధేశ్వరాలయానికి మహర్దశ

● రూ.18 కోట్ల టీటీడీ నిధులతో ఆలయ పునరుద్ధరణ
● నిధుల మంజూరు, ఇ-టెండర్లకు ప్రభుత్వ అనుమతి



తిరుపతి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తలకోనలోని సుప్రసిద్ధ సిద్ధేశ్వరాలయానికి మహర్దశ పట్టనుంది. రూ.18 కోట్ల టీటీడీ నిధులతో ఆలయం పునరుద్ధరణకు నోచుకోనుంది. ఎర్రావారిపాలెం మండలం తలకోన అటవీ ప్రాంతంలోని సిద్ధేశ్వరాలయం పురాతనమైనది. తలకోనకు రోజువారీ వచ్చే పర్యాటకులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులూ ఈ ఆలయాన్ని సందర్శిస్తుంటారు. జనవరి 1, మహా శివరాత్రి, కార్తీక మాసంలో వేలాది మంది భక్తులు తలకోనకు వచ్చి పుణ్యస్నానాలు చేసి సిద్ధేశ్వరాలయంలో పూజలు చేయడం ఆనవాయితీ. ఇప్పటికే అక్కడ టీటీడీ అతిథి గృహాలున్నాయి. తాజాగా భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు టీటీడీ ముందుకొచ్చింది. టీటీడీ ఇంజనీర్లు, స్థపతి క్షేత్రస్థాయిలో పర్యటించి ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ పునరుద్ధరణకు, ఇతర అభివృద్ధి పనులకు రూ.18 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఆ నిధులతో గర్భాలయం, మండపాలు, రాజగోపురం, ధ్వజస్తంభం వంటి వాటితో పాటు ఇతర నిర్మాణాలనూ చేపడతారు. ఇంజనీరింగ్ అధికారుల అంచనాలు రూపొందించాక ఈ ఏడాది మార్చి 24న జరిగిన టీటీడీ బోర్డు సమావేశంలో రూ.18 కోట్లు ఆర్థిక సాయం చేయడానికి ఆమోదిస్తూ తీర్మానం చేశారు. దీనిపై టీటీడీ ఈవో నిధులు మంజూరు చేయడంతో పాటు తొలి విడత ఇ-టెండర్లు పిలిచి రూ.2 కోట్లతో పనులు చేపట్టేందుకు అనుమతి కోరుతూ ఏప్రిల్ 16న ప్రభుత్వానికి లేఖ రాశారు. దానిపై స్పందించిన ప్రభుత్వం నిధుల మంజూరుకు, ఇ-టెండర్లు పిలవడానికి అనుమతిచ్చింది. ఈ మేరకు దేవదాయ శాఖ ఎఫ్ఏసీ ముఖ్య కార్యదర్శి వి.వినయ్‌చంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

● భార్యను దూరం చేస్తోందని..

అత్తను కడతేర్చాడు

స్వర్ణముఖినదిలో మృతదేహం పూడ్చివేత

నాయుడుపేట టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): భార్యను తన నుంచి దూరం చేస్తోందని భావించి అత్తను హత్య చేశాడా అల్లుడు. ఈ ఘటన నాయుడుపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నాయుడు పేట మండలం అయ్యప్పరెడ్డిపాళెంలోని సగుటూరు చెంగమ్మకు ముగ్గురు కుమార్తెలు. మూడో కుమార్తె స్వాతిని పండ్లూరు గ్రామానికి చెందిన వెంకయ్యకు ఇచ్చి వివాహం చేసింది. వీరిద్దరూ చెంగమ్మ ఇంటి వద్దే ఉంటున్నారు. వీరికి ఒక కుమార్తె. కొంతకాలంగా తన నుంచి భార్యను దూరం చేస్తోందని చెంగమ్మ మీద వెంకయ్య కక్ష పెంచుకున్నాడు.



చెంగమ్మ (ఫైల్‌ఫొటో) - మృతదేహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు, సీఐ

ఈ క్రమంలో నెల్లూరులో ఉన్న మరో కుమార్తె వద్దకు వెళ్లిన చెంగమ్మ మంగళవారం మధ్యాహ్నం తిరిగి నాయుడుపేటకు వచ్చింది. బస్టాండ్‌లో దిగిన ఆమెను వెంకయ్య తన ఆటోలో ఎక్కించుకొని షుగర్ ఫ్యాక్టరీ సమీపంలోని స్వర్ణముఖినది వద్ద ఉన్న నర్సరీ సమీపంలోకి తీసుకెళ్లాడు. అక్కడ వారిద్దరి మధ్య చిన్నపాటి వివాదం జరిగింది. వెంకయ్య తన దగ్గర ఉన్న కత్తితో చెంగమ్మ(45) గొంతుకోసి హతమార్చాడు. మృతదేహాన్ని అక్కడే వదిలేసి ఆటో తీసుకొని వెళ్లిపోయాడు. రాత్రి 10 గంటల సమయంలో పార తీసుకెళ్లి గుంట తవ్వి మృతదేహాన్ని పూడ్చిపెట్టాడు. ఈ ప్రాంతానికి సమీపంలో బుధవారం ఉదయం వెంకయ్య సంచరిస్తుండగా చెంగమ్మ బంధువులకు అనుమానం వచ్చి ప్రశ్నించారు. దేహశుద్ధి చేసి గట్టిగా నిలదీయడంతో చెంగమ్మను హతమార్చిన విషయం వెల్లడించాడు.కుటుంబసభ్యులు, బంధువులు పోలీసులకు సమాచారమిచ్చారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, అర్బన్ సీఐ బాబి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సాయంత్రం తహసీల్దారు రాజేంద్ర సమక్షంలో మృతదేహాన్ని వెలికితీసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితుడు వెంకయ్యను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలి

మండల మీట్‌లో ఎంపీపీ లోకనాథం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లోకనాథం

పాకాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడానికి అధికారులు చొరవ చూపాలని ఎంపీపీ లోకనాథం కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇది సరికాదని అన్నారు. జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. పాడి రైతులకు గోకులాలు మంజూరు చేసి, నిర్మించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. మండలంలో పదవ తరగతి ఉత్తీర్ణత శాతం తగ్గడంపై ఆవేదన వ్యక్తం చేశారు. మెరుగైన విద్యాబోధన చేసి ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండేలా చూడాలన్నారు. వీధి లైట్లు, మురుగునీరు సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశిరేఖ, డిప్యూటీ తహసీల్దార్ కల్యాణ్, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు శాతం పెంచాలి


ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో బాబ్జీ

పాకాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు శాతం పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో బాబ్జీ కోరారు. ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం మోడల్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆయన సమావేశమయ్యారు. పాఠశాలల్లో ఇప్పుడున్న సౌకర్యాలు, కావాల్సిన సౌకర్యాలు గుర్తించి అప్‌లోడ్ చేయాలన్నారు. అదనపు తరగతి గదులు, డెస్క్‌లు, టేబుళ్లు, కుర్చీలు అంచనా వ్యయం తదితర వివరాలు పొందుపరచాలన్నారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు కుమార్‌రెడ్డి, సుమతమ్మ, సీఆర్పీలు పాల్గొన్నారు.

వైభవంగా ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఊరేగింపు


పల్లకీలో ఊరేగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజులు

రామచంద్రాపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రామాపురం మహాభారత ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు వైభవంగా జరిగింది. స్వామి అమ్మవార్లకు తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అనంతరం పుష్పపల్లకీలో ఊరేగింపు జరిగింది. గ్రామస్థులు మంగళహారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం భాగవతారిణి అనసూయ ఉత్తర గోగ్రహణం కథను రమ్యంగా వినిపించారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

మండల సమావేశంలో తీర్మానం


సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఎర్రావారిపాలెం, జూలై23 (ఆంధ్రజ్యోతి); గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని మండల సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఎర్రావారిపాలెం మండల సర్వసభ్య సమావేశం ఇన్‌చార్జి ఎంపీపీ రెడ్డెమ్మ అధ్యక్షతన బుధవారం ఉదయం 11 గంటలకు వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జడ్పీటీసీ సభ్యుడు కరణాకరరెడ్డి డిమాండ్ చేశారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో జరిగిన అభివృద్ధి పనులను చదివి వినిపించారు. ఎంపీడీవో మదన్‌మోహన్ రాజు, ఎస్ఐ బాలకృష్ణ, తహసీల్దార్ పరమేశ్వరస్వామి, ఎంఈవో బాల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

'అక్షర ఆంధ్ర' అమలుకు పలు కమిటీల ఏర్పాటు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు చిత్తూరు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా అక్షర ఆంధ్ర పేరిట ఉల్లాస్ పథకం అమలు, స్వచ్ఛంద ఉపాధ్యాయుల నియామకం, తరగతుల నిర్వహణకు సంబంధించి జిల్లా, మండల, పట్టణస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాస్థాయి కమిటీలో చైర్మన్‌గా కలెక్టర్, సభ్యులుగా జడ్పీ సీఈవో, డీఆర్డీఏ పీడీ, మెప్మా పీడీ, మహిళా, శిశు సంక్షేమశాఖ పీడీ, డీపీవో, డీఈవో, డీపీఆర్వో, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారులు ఉంటారు. కోఆర్డినేటర్‌గా వయోజన విద్యాశాఖ అధికారి ఉంటారు. మండలస్థాయి కమిటీ చైర్మన్‌గా ఎంపీడీవో, సభ్యులుగా డీఆర్డీఏ ఏపీడీ, మహిళా, శిశు సంక్షేమశాఖ సీడీపీవో, ఎంఈవోలు ఉంటారు. కోఆర్డినేటర్‌గా వయోజనవిద్య శాఖ అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి వ్యవహరిస్తారు. పట్టణస్థాయి కమిటీకి ఆయా మున్సిపల్ కమిషనర్లు చైర్మన్‌గా, కోఆర్డినేటర్లుగా సిటీమిషన్ మేనేజర్, సీడీపీవో, ఎంఈవో, వయోజన విద్యశాఖ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు.

మంత్రిని కలిసిన టీడీపీ నేతలు



తిరుపతిలో మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను బుధవారం కొందరు టీడీపీ నేతలు కలిశారు. వీరిలో నాయకులు పులుగోరు మురళీకృష్ణారెడ్డి, బీఎల్ సంజయ్, గంగమ్మ గుడి మాజీ సభ్యుడు గెంజి సుధాకర్‌రెడ్డి, తెలుగు యువత నేతలు శరత్, దుష్యంత్ తదితరులున్నారు.

\- తిరుపతి (నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

పాకాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన అందరికీ పార్టీలకతీతంగా అందించాలని ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. పాకాల, రామచంద్రపురం మండలాలకు సంబంధించిన టీడీపీ రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులతో బుధవారం పులివర్తివారిపల్లెలో ఎమ్మెల్యే సమీక్షా సమావేశాలు నిర్వహించారు. వ్యక్తిగత విషయాలకు, కుటుంబ కలహాలకు తావివ్వకుండా నాయకులు ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్‌కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సకాలంలో ప్రజలకుఅందేలా మండల నాయకులు చొరవ చూపాలన్నారు. సంక్షేమ పథకాల గురించి సు పరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ప్రజలకు వివరించాలన్నారు. పాడి పశువులు అధికంగా ఉన్న ప్రాంతాలలో పశువైద్య సేవలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయా మండలాలలో జరిగిన అభివృద్ధి పనులు, చేయాల్సిన పనుల గురించి చర్చించారు. శ్మశాన వాటికలు, ఆర్వో ప్లాంట్‌లు, సీసీ రోడ్లు, వాటర్ ట్యాంకులు నిర్మించాలని నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్, టీడీపీ సీనియర్ నేత వలపల దశరథనాయుడు, పాకాల మండల కన్వీనర్ బోయపాటి నాగరాజ నాయుడు, రామచంద్రాపురం మండల కన్వీనర్ తిరుమల రెడ్డి పాల్గొన్నారు.

చెంగనగుంట రోడ్డును బాగు చేయండి


బాదూరు వద్ద గుంతలు పడ్డ రోడ్డు

రామచంద్రాపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాదూరు నుంచి చెంగనగుంటకు వెళ్లే దారిని బాగు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ రోడ్డుపై మట్టిపోసిన దాఖలాలు లేవు. దీంతో పది కిలోమీటర్ల పొడవున అడుగుకో గుంత ఏర్పడి ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ దారిలో బాదూరు, తాటిమాకులకండ్రిగ, రామానాయుడు కండ్రిగ, పరమాలతో పాటు బుట్టిరెడ్డికండ్రిగ, బంగారెడ్డికండ్రిగ, చెంగనగుంటతో పాటు 20 గ్రామాల ప్రజలు నిత్యం తడుకు మీదుగా పుత్తూరుకు వెళుతుంటారు. గుంతలు ఏర్పడటంతో వర్షాకాలం గుంతలో నీరు ఉండటంతో వాహనచోదకుల బట్టలు తడసి ముద్దవుతున్నాయి. పరమాల వరకు చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో ఉండగా అక్కడి నుంచి తడుకు నగరి నియోజకవర్గంలో ఉంది, దాంతో ఇరువురు ఎమ్మెల్యేలు పట్టించుకోవడంలేదని విమర్శలు ఉన్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఈ రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రైల్వే స్టేషన్‌లో సమష్టిగా నేరాలు నియంత్రిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్ మేనేజర్ చిన్నపురెడ్డి

తిరుపతి(సెంట్రల్), జూలై23): తిరుపతి రైల్వే స్టేషన్‌లో రైల్వే భద్రత దళాలు, ప్రభుత్వ రైల్వే పోలీసులు, రైల్వే ఆపరేటింగ్ విభాగం అధికార, ఉద్యోగ, సిబ్బంది సమష్టిగా నేరాలను నిర్మూలించవచ్చని స్టేషన్ మేనేజరు డాక్టర్ కె.చిన్నపురెడ్డి అన్నారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో బుధవారం జరిగిన కో ఆర్డినేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో ప్రయాణికులకు తగిన రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దొంగతనాల నియంత్రణకు అన్నిశాఖల అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పరస్పరం సహకరించాలన్నారు. రైళ్ల రద్దీ సమయాల్లో ఆర్‌పీఎఫ్, జీఆర్‌పి, దళాలు గస్తీని ముమ్మరం చేస్తే బాగుంటుందన్నారు. జీఆర్‌పీ డీఎస్పీ హర్షిత మాట్లాడుతూ స్టేషన్‌లో పారిశుధ్య సిబ్బంది నుంచి వివిధ శాఖల్లో ఉద్యోగుల వరకు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఫోన్లు చేసిన వెంటనే స్పందించాలన్నారు. స్టేషన్‌లో భవన నిర్మాణాలు జరుగుతుండటాన్ని అవకాశంగా తీసుకుని దొంగలు చోరీలకు పాల్పడే అవకాశాలు వుంటాయన్నారు. ఈ సమావేశంలో ఏఎస్‌సీ రాజగోపాల్ రెడ్డి, ఐపీఎఫ్ సందీప్ కుమార్, సీఐలు ఆశీర్వాదం, సుధాకర్‌రెడ్డి, యతేంద్రలతో పాటు ఎస్‌ఐలు, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పార్వేట ఉత్సవం



శ్రీకాళహస్తి, జూలై 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి అనుబంధంగా విజ్ఞాన గిరిపై కొలువై ఉన్న వళ్లీ, దేవసేన సమేత కమారస్వామి ఆలయ ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా బుధవారం పార్వేట ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మొదట స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అలంకార మండపంలో పలు రకాల అభిషేక పూజలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవమూర్తులను చప్పరం అధిష్టింపజేసి పుర విహారానికి తీసుకొచ్చారు. పట్టణంలో విహరిస్తున్న వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామికి భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

4, 5 తేదీల్లో మొబైల్‌ఫోన్ల ఈ-వేలం

తిరుమల, జూలై23(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలకు భక్తులు కానుకగా సమర్పించిన ఉపయోగించిన, పాక్షికంగా దెబ్బతిన్న 73 మొబైల్ ఫోన్లను ఆగస్టు 4, 5 తేదీల్లో టీటీడీ ఆన్‌లైన్ ద్వారా ఈ-వేలం వేయనున్నారు. ఏపీ ప్రభుత్వ ఈ-కొనుగోలు పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుని వేలంలో పాల్గొనాలని టీటీడీ సూచించింది. వివరాలను 08772264429 ద్వారా తెలుసుకోవచ్చు.

అగ్రిగోల్డ్ ఆస్తుల రక్షణకు జిల్లా కమిటీ

చిత్తూరుకలెక్టరేట్,జూలై23(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలోని అగ్రిగోల్డ్ ఆస్తుల పరిరక్షణకు జిల్లాకమిటీని ఏర్పాటు చేస్తూ కలెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. కమిటీకి కలెక్టర్, జేసీ చైర్మన్‌గా, జిల్లా రిజిస్ట్రార్, డీపీఆర్వో, డిస్ట్రిక్ ఐటీ ఆఫీసర్, తిరుపతి సీఐడీ ఆఫీసర్, ఆర్వో ఆఫీసర్, చిత్తూరు, పలమనేరు మున్సిపల్ కమిషనర్లు, ఐరాల, వి.కోట తహసీల్దార్‌ల ను సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులుజారీచేశారు.

పరశురామేశ్వరుడి సేవలో డిప్యూటీ స్పీకర్



ఏర్పేడు, జూలై 23(ఆంధ్రజ్యోతి): తిరుపతి పర్యటన నిమిత్తం విచ్చేసిన డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు బుధవారం మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే సుధీర్, టీడీపీ మండల అధ్యక్షుడు నాగరాజునాయుడు, ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు, ఈవో రామచంద్రారెడ్డి ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి స్వామిఅమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ డిప్యూటీ స్పీకర్‌కు గుడిమల్లం ఆలయ చరిత్రను వివరించారు. ఆలయ అర్చకుడు వంశీకృష్ణశర్మ ఆశీర్వ చనం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చెంచయ్యనాయుడు, తహసీల్దారు భార్గవి, సీఐ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు భాగ్యలక్ష్మి

భాకరాపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు సరుకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు భాగ్యలక్ష్మి హెచ్చరించారు. చిన్నగొట్టిగల్లు తహసీల్దారు కార్యాలయంలో బుధవారం రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 65 ఏళ్లు నిండిన వృద్ధులకు ప్రతినెలా 28వ తేదీ నుంచి 30 వరకు ఇంటి వద్దనే రేషన్ అందజేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన వేళల్లో రేషన్ షాపుల వద్ద అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ డీటీ సురేంద్ర, ఆర్‌ఐ జానకీరామ్ పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను సద్వినియోగం చేసుకోండి


టమోటా పంటకు సూచనలిస్తున్న ఏవో ధనలక్ష్మి

భాకరాపేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను సద్వినియోగం చేసుకోవాలని రైతులను మండల వ్యవసాయ అధికారిణి ధనలక్ష్మి కోరారు. చిన్నగొట్టిగల్లు మండలం తిప్పిరెడ్డిగారిపల్లె పంచాయతీలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసే రైతులు ఫసల్ బీమా యోజన కింద ఎకరాకు రూ.165 ప్రీమియం చెల్లించి బీమా చేసుకోవాలన్నారు. జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పీఎండీఎస్ కిట్లు కూడా అందుబాటులో ఉన్నాయని, రైతులు తీసుకుని పొలాల్లో విత్తుకోవాలని సూచించారు. అనంతరం టమోటా పంటను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ కటౌట్‌కు పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న అభిమానులు

భాకరాపేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): జనసేనాని పవన్ కళ్యాణ్ కటౌట్‌కు బుధవారం భాకరాపేటలోని ఆయన అభిమానులు పాలాభిషేకం చేశారు. ఆయన నటించిన హరిహర వీరమల్లు చిత్రం గురువారం విడుదలవుతున్న సందర్భంగా భాకరాపేటలో 50 అడుగుల భారీ కటౌట్ ఏర్పాటు చేసి, పాలాభిషేకం చేశారు. ఆ చిత్రం ఘనవిజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవర మనోహర, మండలాధ్యక్షుడు యశ్వంత్ రాయల్, పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.



తిరుపతిలో థియేటర్ వద్ద బుధవారం రాత్రి జనసేన నేతలు, అభిమానుల ఆనందోత్సాహం

'వీరమల్లు' సంబరం


కేకు కట్ చేస్తున్న కిరణ్‌రాయల్ తదితరులు

టమోటా పంటకు వాన దెబ్బ ..!

- ధరలున్నా కాయలు దెబ్బతినడంతో ఆందోళనలో రైతాంగం


సోమలలో వర్షంతో దెబ్బతిన్న టమోటా తోట

సోమల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు టమోటా తోటలు బాగా దెబ్బతిన్నాయి. లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి సాగు చేస్తే వర్షం ప్రభావంతో కోతలు చేయకుండానే దెబ్బతిన్నాయి.సోమల మండలంలోనే దాదాపు 400 ఎకరాల్లో ఏప్రిల్, మే నెలల్లో నాటిన టమోటా రైతులు నష్టపోయారు.ఇన్నాళ్లు టమోటా ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.ఇప్పుడు వర్షం దెబ్బతో పచ్చని తోటల్లో ఆకులు రాలిపోతున్నాయి. చీడపీడలు వ్యాప్తి చెంది కాయలపై నల్లని మచ్చలు, పగుళ్లు రావడంతో పండిన పంటను మార్కెట్‌కు తరలించలేక పొలాల వద్దే వదిలేస్తున్నారు.మూడు రోజులుగా టమోటా ధరలు పెరిగి 15 కిలోల బాక్సు ధర 600 రూపాయలకు చేరుకుంది. అయితే తోటల్లో ఉన్న పంటను మార్కెట్‌కు తరలిస్తే నాణ్యత లేని కాయలు కావడంతో రూ.100 లోపు ధర పలుకుతోంది. పుంగనూరు, పలమనేరు మార్కెట్‌కు రవాణా ఖర్చులే బాక్సుకు రూ.20 చెల్లించాలి. కమీషన్ 10శాతం వసూలు చేస్తారు. ఈ ధరకు పెట్టుబడి సైతం దక్కదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టమోటా సాగుకు ఎకరానికి రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. స్థిరమైన ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనికి తోడు వర్షంతో దెబ్బతిన్న పంటకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందే పరిస్థితి లేదని తెలిసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యానశాఖ అధికారులు స్పందించి టమోటా పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అరెస్టుల్లేవు....రికవరీ లేదు

రూ.1.36 కోట్ల దుర్వినియోగం కేసుపై పలు అనుమానాలున్నాయ్ - జడ్పీ డిప్యూటీ సీఈవో


పుంగనూరు ఎంపీడీవో కార్యాలయంలో వెంకటనారాయణ

పుంగనూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఎంపీడీవో కార్యాలయానికి సంబంధించిన ప్రభుత్వ నిధులు రూ.1.36 కోట్ల దుర్వినియోగంపై జడ్పీ సీఈవో వెంకటనారాయణ విచారణ చేపట్టారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులు పరిశీలించి, నిధులు దుర్వినియోగం కావడానికి బాధ్యులైన అధికారులను ఆయన విచారించి సమగ్ర విచారణ కోసం రికార్డులు తీసుకెళ్లారు.పుంగనూరు ఎంపీడీవో కార్యాలయంలో నిధుల స్వాహా గురించి గత ఏడాది జూన్ 20న 'అమ్మో..కాంట్రాక్టు ఉద్యోగి' శీర్షికన ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే.ఆన్‌లైన్ బెట్టింగులతో అప్పులపాలైన కంప్యూటర్ ఆపరేటర్ సునీల్ వాటిని తీర్చేందుకు ఎంపీడీవో లాగిన్ ఓపెన్ చేసి ప్రభుత్వ నిధులను సొంత ఖాతాలోకి మళ్లించుకున్న ఈ విషయం అప్పట్లో సంచలనం సృష్టించింది.జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకట నారాయణ మీడియాతో మాట్లాడుతూ 2023 ఏప్రిల్ నుంచి 2024 జనవరి వరకు 9 నెలల్లో పుంగనూరు ఎంపీడీవో కార్యాలయంలో రూ.1.36 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగిందన్నారు. దీనిపై గతంలో డీఎల్‌డీవో వెంకటశేషయ్య విచారణ చేపట్టి తుదిదశలో బదిలీ కావడంతో ఆ బాధ్యతను జడ్పీ సీఈవో తనకు అప్పగించారని చెప్పారు. మాజీ ఎంపీడీవో రాజేశ్వరమ్మను, సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర రెడ్డిని విచారించానని, టైపిస్టును, ఈవోపీఆర్డీని విచారించాల్సి ఉందని తెలిపారు. కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేసిన కంప్యూటరు ఆపరేటర్ సునీల్ తమను మోసగించి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని వారు తెలిపారన్నారు. కానీ సూపర్‌వైజరీ బాధ్యతల్లో ఉన్న అధికారులు బాధ్యతలు విస్మరించి కాంట్రాక్టు ఉద్యోగికి ప్రభుత్వ లాగిన్ వివరాలు తెలియజేయడం తప్పు అని తెలిపారు. గతంలో ఎంపీడీవో వెంకటమునిరెడ్డి ఈ నిధుల దుర్వినియోగంపై పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టగా ఎఫ్ఐఆర్ నమోదైనా ఇప్పటి వరకు అరెస్టులు జరక్కపోవడం, నిధుల రికవరీ కాకపోవడంపై అనుమానంగా ఉందని తెలిపారు. ఏ స్థాయిలో తప్పు జరిగింది, బాధ్యులు ఎవరు తదితర విషయాల్లో సమగ్ర విచారణ కోసం సంబంధిత రికార్డులను స్వాధీనం చేసుకుని చిత్తూరు తీసుకెళ్లి పరిశీలించి పూర్తి స్థాయి నివేదిక జడ్పీ సీఈవోకు సమర్పిస్తానని ఆయన వివరించారు.

రేపు లక్ష్మీవైభోగ వ్రతం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), జూలై 23(ఆంధ్రజ్యోతి): తిరుపతి రామచంద్ర పుష్కరిణి వద్ద శుక్రవారం లక్ష్మీ వైభోగ వ్రతం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రెస్‌క్లబ్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ సహకారంతో సత్యనారాయణ స్వామి ఆధ్వర్యంలో 600 మంది మహిళలతో ఈ వ్రతం నిర్వహించనున్నట్లు తెలిపారు. జేఈవో వీరబ్రహ్మం, టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ శిరీష హాజరవుతారని పేర్కొన్నారు.

మా బిడ్డకు ప్రాణం పోయండి



మీడియాతో మాట్లాడుతున్న చెంగమ్మ, దేశయ్య

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), జూలై 23(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌తో బాధపడుతున్న తమ బిడ్డ మురళి(8)కి ప్రాణం పోయాలని నారాయణవనం మండలం నాగిలేరు గ్రామానికి చెందిన చెంగమ్మ, దేశయ్య కోరారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వారు మాట్లాడుతూ కొన్ని రోజులుగా తమ బిడ్డ క్యాన్సర్‌తో బాధపడుతున్నారన్నారు. రుయాలో చూపించగా స్విమ్స్‌కు వెళ్లమని చెప్పారన్నారు. అక్కడ పరీక్షించిన వైద్యులు బ్లడ్ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారించారని, నయం కావాలంటే సుమారు రూ.20 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారని, పేద కుటుంబానికి చెందిన తాము అంత ఖర్చు పెట్టలేదని, దాతలు సాయం చేయాలని కోరారు. సాయం చేయదలచిన వారు 7780253548ను సంప్రదించాలని లేదా ఐటీబీ బ్యాంకు 07400000434ఖాతాకు జమ చేయాలని ఆ దంపతులు వేడుకున్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి, రాజారెడ్డి తదితరులు

తిరుపతి అర్బన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): పవన్‌కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు విడుదల సందర్భంగా స్థానిక గ్రూప్స్ థియేటర్ వద్ద జనసేన నాయకుడు సానె శీను ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వంలో భీమ్లానాయక్ సినిమా టికెట్ల ధరలు తగ్గించి పవన్‌కల్యాణ్‌ను దెబ్బతీయాలని చూశారని, ఇప్పుడు హరిహరవీరమల్లు చిత్రంపైనా కుట్రలు చేస్తున్నారని, ఎవరెన్ని పన్నాగాలు పన్నినా పవన్ తుఫాన్‌ను ఆపలేరని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, సుభాషిణి, బాబ్జీ పాల్గొన్నారు.

సుబ్రమణ్యంయాదవ్ సేవలు ఎనలేనివి



సుబ్రమణ్యం యాదవ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నేతలు

తిరుపతి(గాంధీరోడ్డు), జూలై23(ఆంధ్రజ్యోతి): కో-ఆపరేటివ్ బ్యాంకు అధికారిగా(ఏడీవో), న్యాయవాదిగా, యాదవ సంఘ నేతగా మాచుపల్లి సుబ్రమణ్యం యాదవ్ ఎనలేని సేవలు అందించారని పలువురు గుర్తు చేశారు. డీబీఆర్ రోడ్డులోని నివాసంలో బుధవారం సుబ్రమణ్యంయాదవ్ కర్మక్రియలకు హాజరైన పలువురు ఆయన చిత్రపటానికి పుష్పాలతో నివాళి అర్పించారు. వకుళమాత ఆలయ జీర్ణోద్ధరణ ఉద్యమంలో న్యాయపరంగా కీలకసలహాదారుగా వ్యవహరించారని తెలిపారు. మంగళంపేట వేంకటేశ్వరస్వామి ఆలయ భూములను కబ్జాదారుల నుంచి పరిరక్షించారని గుర్తు చేశారు. ఆయన మృతి న్యాయవాద రంగానికి తీరని లోటన్నారు. డాక్టర్ వంశీకృష్ణ, ఆర్వీ నారాయణ మూర్తి, మద్దూరు శ్రీనివాస్, బాలకృష్ణస్వామి, వెంకటసుబ్బయ్య, గుండాల గోపినాథ్, రాజశేఖర్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స.హ.చట్టంతో ప్రకృతి వ్యవసాయ సమాచారం



సమావేశంలో మాట్లాడుతున్న షణ్ముగం

తిరుపతి రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): స.హ. చట్టం ద్వారా ప్రకృతి వ్యవసాయ విభాగానికి సంబంధించి అవసరమైన సమాచారాన్ని పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ షణ్ముగం పేర్కొన్నారు. ఎమ్మార్‌పల్లెలోని యూత్ హాస్టల్‌లో బుధవారం రైతులు, మహిళలు, వ్యవసాయ సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి పోస్టు ద్వారా లేదా సంబంధిత డాక్యుమెంట్ ద్వారా 30 రోజుల్లోపు సమాచారం అందిస్తామని వివరించారు. ఈ చట్టం ప్రాముఖ్యతపై రైతులు, మహిళలు, మహిళా సంఘాలకు అవగాహనా సదస్సు నిర్వహించి శిక్షణ కూడా ఇస్తామని తెలిపారు. అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

పైపులైన్ల మరమ్మతులు చేపట్టండి



సూచనలు చేస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి(జీవకోన), జూలై 23(ఆంధ్రజ్యోతి): తాగునీటి పైపులైన్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం నగర పరిధిలోని 45వ డివిజన్‌లో ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై స్థానిక కార్పొరేటర్ అనిష్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. పలుచోట్ల తాగునీటి పైపులైన్లు పగిలి నీరు వృథా అవుతోందని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఇంజనీరింగ్ అధికారులు వాటిపై దృష్టి సారించాలని సూచించారు. మురుగునీటి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. కొర్లగుంట ఆరోగ్య ఫార్మసీ వద్ద జరుగుతున్న డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఎస్ఈ శ్యాంసుందర్, ఎంఈ గోమతి, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ రవి, ఏసీపీమూర్తి, డీఈలు రమణ, శిల్ప, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి, టీడీపీ నాయకులు లోకనాథంయాదవ్, లోకేష్‌నాయుడు పాల్గొన్నారు.

తిరుపతి

మహిళ మెడలో గొలుసు చోరీ

తిరుపతి(నేరవిభాగం), జూలై 23(ఆంధ్రజ్యోతి): పట్టపగలు మహిళ మెడ నుంచి గొలుసు లాక్కొని వెళ్లిన ఘటన బుధవారం స్థానిక కోటకొమ్మలవీధిలో చోటు చేసుకుంది. బాధితురాలి వివరాల మేరకు.. కోటకొమ్మలవీధికి చెందిన కమలమ్మ కూలి పనులు చేసుకుని జీవిస్తోంది. మధ్యాహ్నం పనులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడ నుంచి చైను లాక్కొని పరారయ్యాడు. కమలమ్మ గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేశారు. 26 గ్రాముల బంగారు చైను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని తిరుపతి ఈస్ట్ పోలీసులకు అప్పగించారు. అతను విక్టరీ వైన్ షాపు పక్కన జ్యూస్ సెంటర్ నిర్వహిస్తున్న కొంగనపల్లి హరిగా గుర్తించారు.

జాతీయ కోలీముదిరాజ్ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడిగా శివకుమార్



తిరుపతి అర్బన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): జాతీయ కోలీముదిరాజ్ ఏపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడిగా పోలి శివకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు అఖిల భారత కోలీముదిరాజ్ రాష్ట్ర యువజన అధ్యక్షుడు దుడం రెడ్డిబాబు ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన పెద్దలకు శివకుమార్ ధన్యవాదాలు తెలిపారు.

కన్స్యూమర్ కో-ఆపరేటివ్ స్టోర్స్ అధికారి బాధ్యతల స్వీకరణ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ కన్స్యూమర్ కో-ఆపరేటివ్ స్టోర్స్ అధికారిగా సురేష్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

తోపుడు బండ్ల వ్యాపారుల సంఘ నూతన కార్యవర్గం



ప్రసాద్, బుజ్జి

తిరుపతి(ఆటోనగర్), జూలై23 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తోపుడు బండ్ల వ్యాపారుల సంఘం నగర కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నిర్మల్ ప్రసాద్, కార్యదర్శిగా పి.బుజ్జి, కోశాధికారిగా మురళి ఎన్నికయ్యారని సీఐటీయూ నగర అధ్యక్షుడు టి.సుబ్రమణ్యం తెలిపారు. నగర మహాసభలు ముగిసిన తర్వాత నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రామాంజులు, వెంకటేష్, సూరి, రియాజ్, మునిరత్నం, రాజ్‌కుమార్‌లు, సహాయ కార్యదర్శులుగా దాము, శోభ, వెన్నెల, శ్రీనివాసులు, ఈశ్వర్, సురేష్ ఎన్నికయ్యారు.

ఇది ఎవరు రాసిన 'రాత'

● మనిషి బాధ్యతా రాహిత్యాన్ని గుర్తు చేసిన రాత సాంఘిక నాటకం





'రాత' సాంఘిక నాటక దృశ్యాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 23 (ఆంధ్రజ్యోతి): కష్టమొస్తే నా రాత ఇంతే.. అని మనిషి నిట్టూరుస్తాడు. కానీ, సమాజం పట్ల ఎటువంటి బాధ్యతా లేకుండా ప్రవర్తిస్తాడు. దీనివల్ల ఎదుటి మనిషికి, సమాజానికి చాలా చెడు చేసినట్టు అవుతుంది. ఇదంతా ఎవరు రాసిన 'రాత' అంటూ ఓ సాంఘిక నాటక ప్రదర్శనలో ఓ పాత్ర ప్రశ్నించడం కనబడుతుంది. తిరుపతి మహతి కళా క్షేత్రంలో నాటకోత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అభినయ ఆర్ట్స్ చేపట్టిన ఈ ప్రదర్శనల్లో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో శ్రీనివాసరావు రచన, దర్శకత్వంలో ఆ నాటకాన్ని బుధవారం ప్రదర్శించారు. ఇందులో సురభి వాగ్దేవి, సురభి రాఘవ, పవన్ కల్యాణ్, దిలీప్ పాత్రలు పోషించారు. ఉమాశంకర్, జయరాం సాంకేతిక సహకారం అందించారు. మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం ఆధ్వర్యంలో 'బ్రహ్మరథం' పద్య నాటక ప్రదర్శన నిర్వహించారు. ఇందులో కంబాల శ్రీనివాస్, రామచంద్రం, వెంకటశివ, రమాలక్ష్మి, వెంగమాంబ, శ్రీనివాసశర్మ, యల్లయ్య, లక్ష్మయ్య తదితరులు పలు పాత్రలు పోషించారు. కొండలరావు, పరమేష్, సంతోష్, రామచంద్రరావు, శివసుబ్రమణ్యం సాంకేతిక సహకారం అందించారు. ఈ నాటకం చారిత్రక పౌరాణిక అంశాలను దృశ్యమానం చేసింది. అంతకు ముందు ఈ నాటకోత్సవాల్లో వివిధ సంగీత నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, కళాభిమానులు పాల్గొన్నారు.

ద్విభాషల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు చేపట్టాలి

● అనిర్బన్ కుమార్ విశ్వాస్



అధికారులతో సమావేశమైన అనిర్బన్ కుమార్ విశ్వాస్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 23 (ఆంధ్రజ్యోతి): ద్విభాషల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు చేపట్టాలని బెంగళూరులోని భారత హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని అధికార భాషా విభాగ ప్రాంతీయ కమిషనర్ అనిర్బన్ కుమార్ విశ్వాస్ పేర్కొన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. యూనివర్సిటీ వీసీ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ వెంకటనారాయణతో సమావేశమయ్యారు. పాలనా వ్యవహారాల్లో హిందీ అమలు తీరును అధికారులకు వివరించారు. హిందీ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్, హిందీ ఈ-టూల్స్ అప్లికేషన్స్, కంఠస్థ-2.0, అనువాద సాఫ్ట్‌వేర్ వాడకం, హిందీ టైపింగ్ శిక్షణ వంటి అంశాలను అధికారులు వివరించారు. దీనిపై అనిర్బన్ కుమార్ విశ్వాస్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఉత్తర ప్రత్యుత్తరాలు ద్విభాషల్లో చేపట్టాలన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె



కూలడానికి సిద్ధంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

తిరుపతి అర్బన్, జూలై 23, (ఆంధ్రజ్యోతి)మంగళం పరిధిలోని మంగళం క్వార్టర్స్, ఆశా కన్వెన్షన్ హాల్ ప్రధానగేటుకు ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కూలడానికి సిద్ధంగా ఉంది. దాని కింద ఏర్పాటు చేసిన సిమెంటు కట్టడం దెబ్బతిని పగుళ్లు ఏర్పడ్డాయి. ప్రధాన రహదారికి ఆనుకుని ఉండడంతో అటు ప్రజలను, వాహన చోదకులను కలవరపెడుతోంది. విద్యుత్ విభాగం ప్రత్యామ్నాయంగా పక్కనే దిమ్మెను నిర్మించినా వినియోగంలోకి తీసుకురాలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రమాదం జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని, అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

పాతకక్షలతో యువకుడిపై దాడి



గాయపడిన శ్రీనివాసయాదవ్

తిరుపతి(నేరవిభాగం), జూలై 23(ఆంధ్రజ్యోతి): పాత కక్షలతో యువకుడిపై దాడికి పాల్పడిన ఘటన బుధవారం తిరుపతి రూరల్ అవిలాల గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు.. అవిలాల గ్రామానికి చెందిన శ్రీనివాస్ యాదవ్ ఈ ఏడాది జూన్ మూడో తేదీన అంబేడ్కర్ కాలనీలో జరిగిన గంగజాతరకు వెళ్లాడు. ఆ సమయంలో సంతు అలియాస్ కోడి అనే యువకుడితో చిన్నపాటి వాగ్వాదం చోటుచేసుకుంది. అప్పటి నుంచి పగ పెంచుకున్న సంతు స్నేహితులు అజయ్, తేజ, పునీత్, మరి కొందరితో కలిసి బుధవారం మధ్యాహ్నం శ్రీనివాస్ యాదవ్‌పై కర్రలు, కత్తులతో దాడి చేశారు. బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని చంద్రగిరి మండలం తొండవాడ శానంబట్ల వెంచర్ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ మరో నలుగురు కలసి మొత్తం 10 మంది వరకు శ్రీనివాస్‌యాదవ్‌ను చితక్కొట్టారు. విషయం తెలుసుకున్న శ్రీనివాస్ యాదవ్ స్నేహితులు అక్కడికి వెళ్లగా వారిని చూసి అవతలి వ్యక్తులు పారిపోయారు. బాధితుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, ప్రత్యేక టీమ్‌లతో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

చిన్నచిన్న సమస్యలైనా పరిష్కరించండి



సమస్యలను వివరిస్తున్న స్థానికుడు ఢిల్లీబాబు

తిరుపతి అర్బన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో చిన్న చిన్న సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని మంగళం పంచాయతీ పరిధిలోని తిరుమలనగర్ వాసులు కోరారు. తిరుమలనగర్ సచివాలయ ప్రాంగణంలో బుధవారం ఉదయం గ్రామసభ నిర్వహించారు. అధ్యక్షత వహించిన కార్యదర్శి మనోజ్‌కుమార్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 పథకం మార్గదర్శకాలను వివరించారు. ఆసక్తి ఉన్న దాతలు, బాధితులు ఎవరైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. గ్రామస్తులు మాట్లాడుతూ తుడా క్వార్టర్స్, శేషాచలనగర్, ఇతర కాలనీల్లో పారిశుధ్యం లోపించిందని, మురుగు కాలువలు పూడిపోయాయని, అండర్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో పలు సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. కుక్కల బెడద భరించలేకున్నామని, దోమల నివారణ మందులు పిచికారీ చేయాలని, తాగునీరు ఎత్తైన నివాసాలకు సరఫరా కావడం లేదని టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గోవిందరాజులు ఆధ్వర్యంలో కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, రమేష్, నాగేంద్ర, జనార్దన్, ఢిల్లీబాబు, శ్రీనివాసులు, చిన్నరాయప్ప పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామచంద్ర

తిరుపతిరూరల్, జూలై23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ సచివాలయాల్లో బదిలీపై చేరిన ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో కె.రామచంద్ర పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఇతర మండలాల నుంచి బదిలీపై వచ్చిన ఉద్యోగులతో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. సచివాలయ ఉద్యోగులు బాగా పనిచేస్తున్నారని ప్రజలనోట వినబడాలని, విధుల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రత్యేకించి అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు అందుబాటులో ఉండాలని తెలిపారు. అంతకుముందు ఉద్యోగులను, మండలస్థాయి అధికారులను ఆయన పరిచయం చేసుకున్నారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఏఈలు, డిప్యూటీ ఎంపీడీవో పాల్గొన్నారు.

ఆటో మెకానిక్‌ల సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న రవి

తిరుపతి(ఆటోనగర్), జూలై23(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని ఆటో మెకానిక్‌ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఎన్‌డీ రవి కోరారు. బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఆటో మెకానిక్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్మిక చట్టాలను సవరించి కార్పొరేటర్లకు దోచిపెట్టే విధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఆటో మెకానిక్‌ల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. మెకానిక్‌లు షెడ్‌లు నిర్మించుకోవడానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఆగస్టు 23వ తేదీన ఒంగోలులో జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

పట్టించుకోండి సారూ..!

కాస్త వర్షానికే జలమయం



తిరుపతి రూరల్ మండలం జాతీయ రహదారి నుంచి అవిలాలకు వెళ్లే మార్గం గుంతలమయంగా మారింది. కాస్త చినుకులు పడితే చాలు చిత్తడిగా మారిపోతోంది. దీంతో పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు ఆ ప్రాంతంలో వీధి దీపాలు లేకపోవడంతో చీకట్లో అవస్థలు తప్పడం లేదు. అధికారులు స్పందించి గుంతలమయంగా ఉన్న రోడ్లను బాగు చేయాలని కోరుతున్నారు.

- తిరుపతి(ఎమ్మార్‌పల్లె)





అయ్యన్నపాత్రుడు - రఘురామకృష్ణ రాజు, గురజాల జగన్మోహన్ - డ్రమ్స్ శివమణి

తిరుమలలో ప్రముఖులు

తిరుమల, జూలై23(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు, కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం, బీజేపీ నేత అశోక్, డ్రమ్స్ కళాకారుడు శివమణి, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, తెలంగాణ ఎమ్మెల్సీ ఎల్ రమణ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు మీడియాతో మాట్లాడుతూ, ఎంతో నష్టపోయిన రాష్ట్రం ఇప్పుడిప్పుడే అభివృద్ధివైపు అడుగులేస్తోందని అన్నారు. అభివృద్ధిలో అందరం భాగం కావాలని పిలుపునిచ్చారు.

పవన్ సినిమా మాకో పెద్ద పండుగ

● తెలంగాణ టీఎఫ్‌సీసీ కార్యదర్శి శ్రీధర్



టీఎఫ్‌సీసీ సెక్రటరీ శ్రీధర్, నిర్మాత సునీల్ నారంగ్

తిరుమల, జూలై23(ఆంధ్రజ్యోతి): 'దేవుడి దయతో చాలా రోజుల తర్వాత పవన్‌కల్యాణ్ పెద్ద సినిమా 'హరిహర వీరమల్లు' వస్తోంది. మాకో పెద్ద పండుగలా ఉంది. రేపటి నుంచి దీపావళి మొదలవుతుంది' అని తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ జనరల్ సెక్రటరీ శ్రీధర్ అన్నారు. నిర్మాత సునీల్ నారంగ్‌తో కలిసి బుధవారం ఉదయం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, ఈ చిత్రం పెద్ద హిట్ కావాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని ఆరు షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.42 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 79,467

తలనీలాలు సమర్పించినవారు: 28,642




లక్ష్మీవరాహస్వామి


నాలుగు సింహాలు


శంఖునిధి


పద్మనిధి


వ్యాసమహర్షి


సంధ్యాతాండవం శివుడు


మురళీకృష్ణుడు


బయట ప్రధాన గేటు వద్ద శంఖు చక్రం, నామం


అష్టలక్ష్ములు, శ్రీపద్మావతి అమ్మవారు


సీఎంకు బహూకరించే శ్రీనివాసకల్యాణం ప్రతిమ

శయనమూర్తి

సరస్వతీదేవి, లక్ష్మీదేవి


కాళీయమర్దనుడు

కళ్లు చెదిరే కళాకృతులు

● శిక్షణ దశలోనే విద్యార్థుల నైపుణ్య ప్రతీకలు

మనసును కట్టిపడేసే ఈ శిల్పాలను చూస్తే చేయి తిరిగిన శిల్పి ఎవరో చెక్కారేమో అనిపిస్తుంది. కానేకాదు. అవి శిల్పకళలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు తీర్చిదిద్దిన కళాకృతులంటే ఆశ్చర్యం కలుగుతుంది. తిరుపతిలోని టీటీడీ శిల్పకళాశాలలో నాలుగో ఏడాది (చివరి) విద్యార్థుల చేతిలో కళ్లు చెదిరే ఈ కళారూపాలు రూపుదిద్దుకున్నాయి. శిల, సుధా, దారు, లోహ విభాగాల్లో వివిధ రూపాలను చెక్కి అబ్బురపరిచారు. గోవిందరాజ సత్రాలను కూల్చే సమయంలో లభించిన టేకుతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు, అష్టలక్ష్మలతో కూడిన పద్మావతి అమ్మవారు, ప్రస్తుతం కాళీయమర్ధనంలాంటి శిల్పాలు ముచ్చటగొలుపుతున్నాయి. శిక్షణ పూర్తయ్యాక వెళ్లే క్రమంలో విద్యార్థులు ఇలా మనోహర శిల్పాలతో తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. కళాశాల ప్రాంగణంలో వీటిని కొలువుదీర్చి ప్రత్యేక వన్నె తెచ్చారు. తామెప్పుడైనా కళాశాలకు వస్తే ఈ శిల్పాలు మధురానుభూతిని కలిగిస్తాయని విద్యార్థులు చెప్పారు. కొందరు ఆక్రాలిక్‌షీట్, క్యాన్వాస్‌లపై దేవతామూర్తుల పెయింటింగ్‌లను కూడా వేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి


దశావతరాలు - వరసిద్ధివినాయకుడి లోహవిగ్రహం




టేకు కొయ్యతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు - శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠనారాయణమూర్తి - సిమెంట్‌తో చేసిన లతాంగులు, నాట్యగత్తెలు

● టీటీడీ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు

25, 26 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి అర్బన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 25, 26 తేదీల్లో ఉదయం 8 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. టీటీడీలో విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్ ఉద్యోగుల పిల్లలు, బాల మందిర్ పిల్లలు, సీటు వచ్చి వివిధ కారణాలతో మూడు విడతలలో కౌన్సెలింగ్‌కు హాజరుకానివారికి, స్థానిక విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుంది. ధ్రువీకరణ పత్రాలు, ఫీజులతో నేరుగా సంబంధిత జూనియర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావొచ్చు.

ఏరియా ఆస్పత్రుల్లో ట్రైబల్ సెల్

● ఏర్పాటు చేయాలంటూ ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్రావు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 23(ఆంధ్రజ్యోతి): ఏరియా ఆస్పత్రుల్లో ట్రైబల్ సెల్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్రావు ఆదేశించారు. తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం ఆయన జిల్లా అధికారులతో సమీక్షించారు. మైదాన ప్రాంతాల్లో ఎక్కువగా నివసించే గిరిజనులపై అధికారులు దృష్టిపెట్టి, వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. సంక్షేమ పథకాలపై వారికి అవగాహన కల్పించి, లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. గిరిజనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని పోలీసుశాఖను ఆదేశించారు.అటవీ ఉత్పత్తుల సేకరణకుగాను గుర్తింపు కార్డులు జారీ చేయాలని అటవీశాఖకు సూచించారు. గిరిజన సంక్షేమ హాస్టళ్లను ప్రతి 15రోజులకు ఒకసారి వైద్యులు సందర్శించి వైద్యసాయం అందించాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఎస్టీలకు సంబంధించి రోస్టర్ అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విక్రమ్, డిప్యూటీ ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మృణాళిని తదితర అధికారులు పాల్గొన్నారు.

చంద్రగిరి కోటలో స్పీకర్



చంద్రగిరి, జూలై 23(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి కోటను బుధవారం అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సందర్శించారు. సెప్టెంబరు 14, 15 తేదీల్లో జరిగే జాతీయ మహిళా సాధికారిత సదస్సులో పాల్గొనే కమిటీ సభ్యులు తర్వాత చారిత్రాత్మకమైన చంద్రగిరి కోటను సందర్శించనున్నారు. ఈ క్రమంలో తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, జిల్లా టూరిజం అధికారి జనార్దన్‌రెడ్డి, ఆర్డీవో రామ్మోహన్, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, లైటింగ్ షో మేనేజర్ మోహన్ తదితరులతో కలిసి స్పీకర్ కోటను పరిశీలించారు. చంద్రగిరి కోట ప్రాశస్త్యాన్ని తెలిపేలా మ్యూజికల్ లైట్‌షో ఏర్పాటు చేస్తామన్నారు. ఆ రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు విందు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

→ చంద్రగిరి కోటను సందర్శిస్తున్న స్పీకర్, తుడా చైర్మన్

మత్తు ఇంజక్షన్ వేసుకుంటూ..!

● డ్రోన్‌కు చిక్కిన నలుగురు యువకులు

● కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



తిరుపతి(నేరవిభాగం), జూలై 23(ఆంధ్రజ్యోతి): చెట్ల పొదల్లో మనల్ని ఎవరు చూస్తారులే అనుకున్నారు. మత్తు ఇంజక్షన్లు వేసుకుంటూ.. మత్తులో మునిగి తేలుతున్నారు. ఇలా తిరుపతి రూరల్ మండలం లింగేశ్వర నగర్‌లో బుధవారం మత్తు ఇంజక్షన్లు వాడుతున్న నలుగురు యువకులను డ్రోన్ కెమెరాతో నిఘా వుంచి పోలీసులు పట్టుకున్నారు. ఇలాంటి వారిని పట్టుకునేందుకు రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచారు. అలా నిఘా ఉంచిన డ్రోన్ కెమెరాకు.. లింగేశ్వరనగర్‌లోని మారుమూల ప్రాంతంలో పొదల మధ్య మత్తు ఇంజెక్షన్లు తీసుకుంటూ నలుగురు యువకులు చిక్కారు. ఎస్పీ నేతృత్వంలోని ఈగల్ టీమ్‌లు, డ్రోన్ కెమెరాల సిబ్బంది గుర్తించారు. వారిని పట్టుకుని తిరుపతి రూరల్ పోలీసులకు అప్పగించారు. రూరల్ సీఐ చిన్నగోవిందు వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. యుక్త వయస్సులో ఇలా చెడు అలవాట్లకు బానిసలుగా మారితే భవిష్యత్ మొత్తం సర్వ నాశనం అవుతుందని హితవు పలికారు. వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించారు. తల్లిదండ్రుల అనుమతితో వారిని వైద్యుల సూచనల మేరకు రీహాబిలిటేషన్ కేంద్రానికి పంపి కౌన్సెలింగ్ ఇప్పిస్తామని చెప్పారు.


బర్డ్ ఆస్పత్రిపై సమీక్షిస్తున్న టీటీడీ చైర్మన్, ఈవో

బర్డ్‌లో అలస్యం లేకుండా

సర్జరీలను పూర్తి చేయండి

● టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సూచన

తిరుపతి(వైద్యం), జూలై 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలోని బర్డ్ (బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ రిహాబిలిటేషన్ ఫర్ ద డిజేబుల్)కు వచ్చే రోగులు సర్జరీల కోసం ఎదురు చూడకుండా.. ఆ సమయాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని వైద్యాధికారులకు టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు సూచించారు. తిరుపతిలోని శ్రీపద్మావతి అతిథి గృహంలో బుధవారం ఆయన టీటీడీ ఈవో శ్యామలరావుతో కలిసి బర్డ్ అధికారులతో సమీక్షించారు. అవసరమైన వైద్య పరికరాలు, మందులు, వైద్యులను, సిబ్బందిని అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కీళ్ల మార్పిడి తదితర శస్త్ర చికిత్సలకు అవసరమైన విదేశీ పరికరాలను మరింత నాణ్యమైన వాటిని ఎంపిక చేసుకొని మన ధరలకు అనుగుణంగా సేకరించాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా చక్కటి గుర్తింపు ఉన్న బర్డ్‌ను గత కొంతకాలంగా నిర్వీర్యం చేయడం బాధాకరమన్నారు. తిరిగి బర్డ్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బర్డ్‌పై నమ్మకంతో వచ్చే రోగుల నమ్మకాన్ని నిలబెట్టేలా వైద్య సేవలు అందించాలని సూచించారు. 'శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలలో చిన్నపిల్లల గుండె శస్త్ర చికిత్సలకు దాతలు విరాళాలు ఇచ్చే అపన్న హృదయ పథకం ఉంది. బర్డ్‌లోనూ అర్హులైన నిరుపేదలకు శస్త్ర చికిత్సలు చేసేందుకు దాతల నుంచి విరాళాలు సేకరించే అంశంపై సంబంధిత అధికారులు సంయుక్తగా నివేదిక తయారు చేయాలి' అని ఈవో శ్యామలరావు పేర్కొన్నారు. అధునాతన వైద్య పరికరాలను నిబంధనల మేరకు కొనుగోలు చేయాలన్నారు. దివ్యాంగ పిల్లలకు తక్షణమే సర్జరీలను చేస్తున్నామని బర్డ్ డైరెక్టర్ డాక్టర్ జగదీష్ చెప్పారు. జాయింట్ రీప్లేస్మెంట్‌లకు మాత్రమే ఏడాది సమయం పడుతోందన్నారు. అనంతరం బర్డ్ ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలు, అభివృద్ధి పనులను ఆయన పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సభ్యుడు నన్నపనేని సదాశివరావు, జేఈవో వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

భవనాల నాణ్యతలో రాజీ వద్దు

స్విమ్స్ ఆవరణలో నిర్మిస్తున్న భవనాల నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా చూడాలని అధికారులను టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు ఆదేశించారు. స్విమ్స్‌లో నిర్మిస్తున్న పలు విభాగాలకు సంబంధించిన భవనాలను బుధవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను, వైద్య పరికరాలను, సిబ్బందిని త్వరితగతిన పూర్తి చేసి రోగులకు ఇబ్బందులు లేకుండా వైద్యసేవలు అందించాలన్నారు. స్విమ్స్ అభివృద్ధిపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సభ్యులు సుచిత్ర ఎల్లా, సదాశివరావు, జేఈవో వీరబ్రహ్మం, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, సీఈ సత్యనారాయణ, ఎస్ఈలు మనోహర్, వెంకటేశ్వర్లు, ఎంఎస్ డాక్టర్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

● వరదయ్యపాళెంలో నలుగురు, పనపాకంలో ఇద్దరు

● 20 దుంగలు స్వాధీనం

సత్యవేడు/మంగళం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రెండు చోట్ల మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం జరిపిన తనిఖీల్లో ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లు పట్టుబడ్డారు. మొత్తం 20 దుంగలు, మూడు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. వరదయ్యపాళెం ఆర్టీసీ బస్టాండు వద్ద ఎస్ఐ మల్లికార్జున, సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. శ్రీకాళహస్తి నుంచి వచ్చిన కారు, మినీ వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా 11 ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. వాహనాల్లోని లంక వినోద్, కృష్ణ, పెంచలయ్య, అనిల్‌ను అదుపులో తీసుకున్నారు. దుంగలు, రెండు వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి.. నలుగురు స్మగ్లర్లపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపామని ఎస్ఐ తెలిపారు.

పనపాకం వద్ద టాస్క్‌ఫోర్సు తనిఖీలు


పట్టుబడ్డ స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

చంద్రగిరి మండలం పనపాకం సమీపం సి.మల్లవరం క్రాస్ వద్ద జాతీయ రహదారిపై మంగవారం రాత్రి తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఐ నరేష్ బృందం తనిఖీలు చేపట్టారు. కాస్త దూరంలో ఓ లారీ పక్కకు ఆగింది. అందులో నుంచి ఇద్దరు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించగా.. పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. వీరు కర్ణాటకకు చెందిన వారని గుర్తించారు. లారీలో తనిఖీ చేయగా తొమ్మిది ఎర్రచందనం దుంగలు లభించాయి. దుంగల సహా లారీని, స్మగ్లర్లను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తీసుకొస్తున్న ఇద్దరి అరెస్టు

● నాలుగు కిలోలు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జూలై 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం భూమయ్యగారి పల్లికి చెందిన గూలూరు చంద్రమోహన్, అదే ప్రాంతానికి చెందిన ఇరసపల్లి అరుణ్‌కుమార్ స్నేహితులు. సులభ సంపాదనకు అలవాటు పడ్డారు. తెలిసిన వారి ద్వారా గంజాయి తీసుకొచ్చి తిరుపతిలో విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో భద్రాచలం వెళ్లారు. శ్రీకాకుళం నుంచి మనోహర్ గంజాయి తీసుకొచ్చి భద్రాచలంలో భారీగా విక్రయిస్తుంటాడు. అతడి వద్ద వీరు రూ.80 వేలకు నాలుగు కిలోల గంజాయి కొన్నారు. రైలులో దిగి తిరుచానూరు రోడ్డు వైపు నడుచుకుంటూ వెళ్తున్నారు. దీనిపై ఈస్ట్ సీఐ శ్రీనివాసులకు అందిన సమాచారం మేరకు ఎస్ఐ హేమాద్రి, సిబ్బంది కలిసి వారిని పట్టుకున్నారు. వారి నుంచి నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి ప్రధాన నిందితుడు మనోహర్ కోసం ప్రత్యేక బృందాలను నియమించారు.

పుత్తూరు వార్తలు

ఆటోకు నిప్పు పెట్టిన నిందితులను అరెస్టు చేయాలి



ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పణ

పుత్తూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆటోకు నిప్పు పెట్టిన నిందితులను వెంటనే అరెస్టు చేసి బాధితుడికి న్యాయం చేయాలని తిరుపతికి బుధవారం విచ్చేసిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్‌రావుకు ఎస్టీ సంఘ నాయకులు వినతిపత్రం అందించారు. ఎస్టీ సంఘ రాష్ట్ర కార్యదర్శి చిరంజీవి మాట్లాడుతూ.. ఈనెల 18న పుత్తూరు పట్టణంలో అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గిరిజనుడు రాజయ్యకు చెందిన ఆటోను కాల్చి వేశారని తెలిపారు. ఈ సంఘటనలో బాధ్యులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్ష పడేలా చేయాలని కోరారు. నిందితులపై అట్రాసిటీ కేసును కూడా నమోదు చేయాలని పోలీసులకు సిఫార్సు చేస్తామని శంకర్‌రావు హామీ ఇచ్చారు.

నేటినుంచి ధర్మరాజస్వామి తిరునాళ్ల

పుత్తూరు టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొలువై ఉన్న ద్రౌపది సమేత ధర్మరాజస్వామి ఆలయ తిరునాళ్లు ఈనెల 24నుంచి ప్రారంభం కానున్నాయి. ఆగస్టు 11 వరకు జరగనున్న ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ ఆవరణలో పి.స్వర్ణలత ఆధ్వర్యంలో మహాభారత హరికథా కాలక్షేపం ఉంటుందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

అన్న క్యాంటీన్‌పై ఆరోపణలు తగవు

పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు గాలి జీవరత్నం

పుత్తూరు అర్బన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం కోసం నిరంతరం పరితపిస్తున్న కూటమి ప్రభుత్వం పట్ల అనుచిత వ్యాఖ్యలు, ఆరోపణలు చేయడం తగదని పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు పేర్కొన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పట్టణంలో పేదల ఆకలి తీర్చడం కోసం నిర్మించిన అన్న క్యాంటీన్‌పై విమర్శలు చేయడం తగదన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకే క్యాంటీన్ నిర్మాణం చేపట్టామన్నారు. ఆలయ భూమిని ఆక్రమించి నిర్మించారన్న విమర్శలను తప్పుబట్టారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు కార్వేటినగరం రోడ్డులో క్యాంటీన్ నిర్మించామని స్పష్టం చేశారు.

విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలి

వడమాలపేట,జూలై 23(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు ముందు చూపుతో జాగ్రత్తలు పాటించాలని ఈగల్ టీం మండల ఇన్‌చార్జి కమల్ చెప్పారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈగల్ టీం ఆధ్వర్యంలో నో డ్రగ్స్, నో టెన్షన్స్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మత్తుకు బానిస కాకూడదని, చదువులపై దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు. సెల్ ఫోన్లను విడనాడాలని, అసభ్య యాప్‌లపై వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అధ్యాపకులు, హెడ్ కానిస్టేబుల్ దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మహా రుద్రాభిషేకం



వడమాలపేట,జూలై 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భవానీ శంకర ఆలయంలో మహాశివుడి జన్మ నక్షత్రం ఆరుద్ర సందర్భంగా మహా రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. బుధవారం ఉదయం సదాశివుడి మహాలింగానికి వేదమంత్రాలతో అభిషేకం నిర్వహించారు. రుద్ర గమకాలు పఠిస్తూ భక్తుల శివనామ స్మరణల నడుమ మహారుద్రాభిషేకం నిర్వహించారు. అర్చకులు శివ, సాయి ఆధ్వర్యంలో వేదమంత్రాలతో రుద్ర, శాంతి హోమాలు నిర్వహించారు. మహాశివుని లింగాన్ని పూలమాలాలతో విశేషంగా అలంకరించి మంగళ హారతులిచ్చారు. తీర్థప్రసాద వినియోగం సహా అన్నదానం జరిగింది.

సమన్వయంతోనే మండలాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

వడమాలపేట,జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధి చేయాలని జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి చెప్పారు. బుధవారం ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న బంగారు కుటుంబాల అర్హులను ఈనెలాఖరు లోగా గుర్తించాలని ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు బంగారు కుటుంబాల అర్హుల గుర్తింపు, పంచాయతీలలో పారిశుధ్యం కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రభుత్వ స్థలంలో, గుట్ట పోరంబోకు స్థలాల్లో నివాసం ఉంటున్న వారు చలానా చెల్లించి రెగ్యులరైజ్ చేసుకోవాలని తహసీల్దార్ జరీనా చెప్పారు. అర్హులైన వారు ఇంటి పట్టాకోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. పామాయిల్ పంట సాగుచేసే రైతులకు వందశాతం, పండ్లతోటలు, కూరగాయలు, పూలు సాగు చేస్తే 20 శాతం రాయితీ ఇస్తున్నట్లు ఉద్యానవన శాఖ అధికారి తెలిపారు. గ్రామాల్లో 24 గంటలు విద్యుత్ సరఫరా కు ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఏఈ రవికుమార్ తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీ విత్తనాలు, యూరియా పంపిణీ చేసినట్లు ఏవో విజయ్‌కుమార్ తెలిపారు. రైతులు ఈక్రాప్ నమోదు చేసుకుంటేనే సబ్సిడీలు వర్తిస్తాయన్నారు. ఉపాధిహామీ పథకం కింద ఆర్థిక సంవత్సరం లో 4.46 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్టు ఏపీవో హంసవేణి తెలిపారు. ఓబీఆర్ కండ్రిగ - రామరాజు కండ్రిగ రోడ్డు అధ్వానంగా సర్పంచ్ శ్రీవిద్యా సభ దృష్టికి తీసుకొచ్చారు.

కేజీబీవీలో తనిఖీలు

తడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయంలో జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ గౌరీశంకర్‌రావు బుధవారం తనిఖీలు చేశారు. పాఠశాల ల్యాబ్‌లో పరికరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ శ్రద్ధతో చదివి పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలన్నారు. పరిశుభ్రమైన వాతావరణంలో విద్యార్థులకు భోజనం వడ్డించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఎంఈవో మల్లికార్జునరావు, ఏపీవో భువనేశ్వరి, జీసీడీవో పుష్పలత ఉన్నారు.

గ్రామాల్లో వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలి

గూడూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గురవయ్య అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచడం, తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు పూటుకూరు యామిని, వైస్ ఎంపీపీ ఇంద్రాణి, ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.

ఉనికి కోసం ఆరోపణలు చేస్తే సహించం: టీడీపీ

కోట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రజాదరణ కోల్పోయి దిక్కుతోచనిస్థితిలో కొట్టుమిట్టాడుతూ ఉనికిని కాపాడుకునేందుకు అసత్య ఆరోపణలు చేస్తే సహించే ప్రసక్తే లేదని టీడీపీ నాయకులు హెచ్చరించారు. కోటలోని టీడీపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు పలగాని భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే పాశింపై వైసీపీ ఇన్‌చార్జి మేరిగ మురళీధర్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. నియోజకవర్గంలో పాశిం సహకారంతో కోట్లాది రూపాయాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ఇంటి స్థల విషయమై వివాదం

కత్తితో దాడి ● యువకుడికి తీవ్ర గాయాలు

దొరవారిసత్రం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఇంటి స్థల విషయంలో నెలకొన్న వివాదంలో ఒకరిపై మరొకరు కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన మండలంలోని తల్లంపాడులో బుధవారం జరిగింది. తల్లంపాడు ఎస్సీ కాలనీలోని చింతపూడి కుమార్, చింతపూడి ఉమామహేష్ మధ్య రెండు రోజులుగా ఇంటి స్థలం విషయంలో వివాదం జరుగుతోంది. బుధవారం వివాదం రేగడంతో ఉమామహేష్ కత్తితో కుమార్‌పై దాడిచేశాడు. మెడ భాగంలో బలమైన గాయం కావడంతో కుమార్‌ను స్థానికులు హుటాహుటిన సూళ్లూరుపేటకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తీసుకెళ్లారు. కుమార్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. దాడికి పాల్పడిన ఉమామహేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బైక్ నుంచి జారి పడి మహిళకు గాయాలు

దొరవారిసత్రం, జూలై 23(ఆంధ్రజ్యోతి): బైక్‌లో నుంచి జారి పడి మహిళకు గాయాలైన ఘటన దొరవారిసత్రం మండలం పోలిరెడ్డి పాళెం భారత్ పెట్రోల్ బంకు ఎదురుగా జాతీయ రహదారిపై జరిగింది. గాయపడిన మహిళను స్థానిక టోల్ ప్లాజా అంబులెన్స్ సిబ్బంది సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.





పూడేరు వద్ద గ్రావెల్ తవ్వి టిప్పకు నింపుతున్న ఎక్స్‌వేటర్ - అక్రమంగా గ్రావెల్ తరలించడంతో ఏర్పడిన గోతుల్లో చేరిన నీరు

పూడేరులో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు

ఆ ప్రాంతం తమ పరిధి కాదంటున్న అటవీ, రెవెన్యూ శాఖలు

నాయుడుపేట టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గ్రావెల్, ఇసుక ఎక్కడుంటే అక్కడ అక్రమార్కులు వాలిపోతున్నారు. నాయుడుపేట మండలంలోని పూడేరులో నివాసాలకు సమీపంలో ఉన్న భూముల్లో నుంచి అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. నాయుడుపేట మండలం పూడేరు గ్రామానికి సమీపంలోనే గిరిజన కాలనీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉన్నాయి. ఆ ప్రాంతంలో ఎక్స్‌కవేటర్ల సాయంతో గ్రావెల్ తవ్వి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. గ్రావెల్ తవ్వకంతో భారీగా గుంతలు ఏర్పడి వర్షానికి నీళ్లు చేరుతున్నాయి. పాఠశాల విద్యార్థులు, కాలనీలో నివాసం ఉంటున్న చిన్నారులు సరదాగా ఆడుకునేందుకు వెళుతుంటారు. ఆ సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అక్రమ గ్రావెల్ తవ్వకం గురించి అటవీ, రెవెన్యూ శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఆ ప్రాంతం తమ పరిధిలోనిది కాదని ఇరుశాఖల అధికారులు చెబుతున్నారు. దీంతో అడిగేవారే లేరని గ్రావెల్ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రావెల్ తవ్వకాలను అడ్డుకోవాలని పూడేరు గ్రామస్తులు కోరుతున్నారు.

ఇరకంకుప్పంవాసులకు ఇళ్ల పట్టాల పంపిణీకి సన్నాహాలు

తడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇరకంకుప్పం గ్రామస్తుల కష్టాలు తొందరలో తీరిపోనున్నాయి. వారికి పూడికుప్పంలో స్థిర నివాసం ఏర్పాటుకు అవసరమైన స్థలాల కేటాయింపునకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇరకందీవివాసులకు కనీస అవసరాలు లేకపోవడంతో ఆ పంచాయతీ పరిధిలోని పూడికుప్పానికి వలస వచ్చేందుకు నిర్ణయించుకున్నారు. తమకు పూడికుప్పంలో ఇళ్ల స్థలాలు కేటాయించాలంటూ గత ఐదేళ్లగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. దీనిపై ప్రస్తుత ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఇళ్ల పట్టాల పంపిణీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఒక్కొక్క కుటుంబానికి 2 సెంట్ల చొప్పున 210 కుటుంబాలకు పూడికుప్పంలో స్థలాలు కేటాయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేయనున్నారు. బుధవారం ఎమ్మెల్యే విజయశ్రీతో పాటు మత్స్యకార నాయకులు, ఇరకం, పూడికుప్పం గ్రామస్తులు కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలుసుకుని ఇళ్ల స్థలాలు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టాల పంపిణీ కార్యక్రమానికి హాజరు కావాల్సినదిగా కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొమ్మన్ పళణి, బొమ్మన్ శ్రీధర్, సుధాకర్, శివాజీ, వాసు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

ప్రభుత్వ భూముల్లోకి వెళ్లరాదంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు

తడ, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూరు పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి పక్కన పోరంబోకు భూముల్లోకి ఎవరూ ప్రవేశించరాదని, అక్కడ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వలేదని తహసీల్దారు శరత్‌బాబు తెలిపారు. సదరు భూముల్లో గుడి నిర్మాణం జరిగిందని, అందులో క్షుద్రపూజలు జరుగుతున్నాయంటూ ఆదివారం కొండూరు గ్రామస్తులు ఆలయాన్ని ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. దీనిపై అధికారులు విచారణ జరిపారు. సదరు భూమి ప్రభుత్వానికి చెందినదిగా గుర్తించారు. ఆ భూముల్లోకి ఎవరూ వెళ్లరాదంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధం



దొరవారిసత్రం, జూలై 23(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం ఎన్ఎం అగ్రహారం వద్ద జాతీయ రహదారిపై బుధవారం రాత్రి కారు దగ్ధమైంది. సూళ్లూరుపేట మండలం సుద్దమడుగు తాగేలి నుంచి నాయుడుపేటకు వెళ్తున్న స్కార్పియో కారులో ఎన్ఎం అగ్రహారం వద్ద మంటలు చెలరేగాయి. కారులో ఉన్న విజయశేఖర్‌రెడ్డి అప్రమత్తమై రహదారి పక్కన ఆపేసి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న సూళ్లూరుపేట అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది.

ద్విచక్ర వాహనానికి నిప్పు

వెంకటగిరి టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలిశెట్టి గుంట వద్ద మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనానికి నిప్పు పెట్టారు. బాధితుడు అబ్దుల్ అజీజ్ తెలిపిన వివరాలు... ప్రతిరోజూ లాగే మంగళవారం రాత్రి ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశాడు. అర్ధరాత్రి వాహనం మంటల్లో కాలిపోతుండడంతో చుట్టుపక్కల స్థానికులు గమనించి అజీజ్‌ను నిద్రలేపారు. అప్పటికే వాహనం పూర్తిగా కాలిపోయింది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

వెలుగు సీసీకి సన్మానం

చిట్టమూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండల వెలుగు సీసీగా పనిచేసిస్తూ పదవీ విరమణ పొందిన రెడ్డెమ్మను బుధవారం సత్కరించారు. స్థానిక స్త్రీ సంక్షేమ భవనంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు పూలమాలలు, శాలువాలతో రెడ్డెమ్మను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గున్నయ్య, సీసీలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

సూళ్లూరుపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరులో బీజేపీ పట్టణ అధ్యక్షుడు అత్తిరాల కిరణ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కరపత్రాలు అందజేసి వివరించారు. ప్రజల సమస్యలను డిగి తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బెజవాడ విజయమ్మ, నియోజకవర్గ నాయకులు తాడిపర్తి ఆదినారాయణ రెడ్డి, బీజేపీ నాయకులు నూతలపాటి శ్రీనివాసులు, సుజన్ రావు, దుర్గి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు

కోట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కోటలోని బాలసదనంలో చిన్నారులకు బుధవారం తిరుపతి రుయా ఆస్పత్రి సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. బాలసదనం ఇన్‌చార్జి సూపరింటెండ్ ముని కుమారి ఆధ్వర్యంలో రుయా వైద్యాధికారులు డాక్టర్ గుణశేఖర్, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ రూన్సీ, డాక్టర్ శ్రీనివాసులు చిన్నారులకు వచ్చే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులను పంపిణీ చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గూడూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. మొక్కలను పెంచడం వల్ల కాలుష్యాన్ని నియంత్రించి పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక స్పృహ కలిగివుండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, శ్రీకాంత్, శ్రీహరిబాబు, హరిబ్రహ్మ, చందన, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేయడం తగదు

గూడూరు అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తాను ఎవరినీ అసభ్య పదజాలంతో దూషించలేదని, సీఐటీయూ నాయకులు తనపై అసత్య ఆరోపణలు చేయడం తగదని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె చేస్తుండడంతో ఎక్కడా పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నామన్నారు. తాను ఎవరినీ దూషించలేదని, తప్పుచేశానని తేలితే శాఖాపరమైన చర్యలు సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు.

పీ-4 కార్యక్రమంపై అవగాహన

గూడూరు అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 19వ సచివాలయంలో బుధవారం పీ-4 కార్యక్రమం అవగాహన సదస్సు నిర్వహించారు. మాజీ కౌన్సిలర్లు బిల్లు చెంచురామయ్య, ఇశ్రాయిల్ కుమార్ మాట్లాడుతూ పేదరికాన్ని నిర్మూలించేందుకు సీఎం చంద్రబాబు పీ-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలన్నారు. కార్యక్రమంలో సుధీర్, రమేష్‌కుమార్, సుధాకర్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేశారని ఫిర్యాదు

గూడూరు అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆస్పత్రి రోడ్డులో మంగళవారం రాత్రి ఓ యువకుడిపై దాడి చేశారని బుధవారం ఒకటో పట్టణ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఒకటో పట్టణ ఎస్ఐ తిరుపతయ్య వివరాల మేరకు... స్థానిక ఆస్పత్రి రోడ్డులోని ఓ పానీపూరి దుకాణం వద్ద పట్టణానికి చెందిన రాకేష్‌తో మరో ఇద్దరు యువకులకు మధ్య స్వల్పవివాదం జరిగింది. ఈ క్రమంలో ఇద్దరు యువకులూ కలిసి రాకేష్‌పై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గొడ్డేరువాగులో పడి వ్యక్తి మృతి

వెంకటగిరి టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మూలశాలివీధికి చెందిన దొంతు మునెయ్య(50) చింతగుంట వద్ద ఉన్న గొడ్డేరు వాగులో పడి మృతి చెందాడు. ఎస్ఐ ఏడుకొండలు కథనం మేరకు... మంగళవారం సాయంత్రం కుటుంబంలో చిన్నపాటి గొడవ జరగడంతో మునెయ్య ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన స్థానికులు చింతగుంట వద్ద ఉన్న గొడ్డేరువాగులో మునెయ్య మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఏడుకొండలు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించండి

వెంకటగిరి టౌన్, డక్కిలి, జులై 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు బకాయి ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీవీ.రమణయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి కూలీలు, ఉపాధి సిబ్బందితో కలిసి నిరసన తెలిపారు. అనంతరం మాట్లాడుతూ రోజూ కూలి పనులు చేసుకుని జీవనం సాగించే వారికి రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. రెండు నెలలుగా ఉపాధి బిల్లులు ఖాతాల్లో పడకపోవడంతో కూలీలు ఇతర పనులకుపోవాల్సిన పరిస్థితి వస్తోందన్నారు. ఉపాధి పథకంలో వ్యవసాయ భూముల అభివృద్ధి, పంట కాలువలు పూడికతీత, మరమ్మతు పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏవోకు కృష్ణయ్యకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం సభ్యుడు భాస్కర్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు. అలాగే డక్కిలి మండల పరిషత్ కార్యాలయ అధికారులకు రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రమణయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఉపాధి కూలీలకు రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు.

స్పీకర్, డిప్యూటీ స్పీకర్లను కలిసిన విజయశ్రీ

సూళ్లూరుపేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజును సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కలిశారు. బుధవారం తిరుపతిలో ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన స్పీకర్, డిప్యూటీ స్పీకర్లను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.



స్పీకర్ అయ్యన్న పాత్రుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

కొరిడి-పేర్నాడు తారురోడ్డు నిర్మాణానికి కృషి

తడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలోని కొరిడి - పేర్నాడు రోడ్డు నిర్మాణానికి అవసరమైన అనుమతుల మంజూరుకు కృషి చేస్తామని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ నెలవల విజయశ్రీకి హామీ ఇచ్చారు. బుధవారం కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలిసిన ఎమ్మెల్యే విజయశ్రీ పలు సమస్యలను వివరించారు. ముఖ్యంగా కొరిడి - పేర్నాడు రోడ్డు అటవీ, వన్యప్రాణి పరిధిలో ఉన్నందున అనుమతుల మంజూరు విషయంలో జాప్యం జరుగుతోందని, తారురోడ్డు నిర్మాణానికి అనుమతులు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పక్షుల పండుగలో పడవల ఏర్పాటు చేసినందుకు మత్స్యకారులకు ఇవ్వాల్సిన బకాయిలు మంజూరు చేయాలని కోరారు. అటవీ శాఖ అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరలోనే అనుమతులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అలాగే పడవల బకాయిలను త్వరలోనే చెల్లిస్తామన్నారు.

రెజాంగ్ లా రాజ్ కలశ యాత్రకు స్వాగతం



పెళ్లకూరులో స్వాగతం పలుకుతున్న మాజీ ఎంపీ నెలవల

సూళ్లూరుపేట, దొరవారిసత్రం, పెళ్లకూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): భారత సైన్యంలో అహీర్(యాదవ) రెజిమెంట్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నిర్వహిస్తున్న రెజాంగ్ లా రాజ్ కలశ యాత్ర బుధవారం సూళ్లూరుపేటకు చేరింది. ఏప్రిల్ 13న బిహార్‌లో అఖిల భారత యాదవ మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ సోమప్రకాష్ ఆధ్వర్యంలోని ప్రారంభమైన ఈ యాత్రకు సూళ్లూరుపేట జాతీయ రహదారిపై హోలీక్రాస్ వద్ద యాదవ సంక్షేమ సంఘ నాయకులు రమణయ్య, జెట్టి వేణుయాదవ్, మెళ్లకంట శ్రీనివాసులు, డాక్టర్ మునస్వామి, మోహన్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సోమప్రకాష్ మాట్లాడుతూ 1962లో చైనాతో జరిగిన యుద్ధంలో 120మంది అహీర్ వీరసైనికులు పోరాటం చేసి లడక్ చుగుల్ ఫైర్ ఫీల్డును కాపాడారన్నారు. ఈ యుద్ధంలో 114మంది అహీర్ వీరులు (యాదవ) వీర మరణం పొందినట్లు వివరించారు. యాదవ వీరుల జ్ఞాపకార్థం అహీర్ రెజిమెంట్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే రెజాంగ్ లా రాజ్ కలశ యాత్రకు దొరవారిసత్రంలో స్థానిక యాదవ నాయకులు సగిలాల రమణయ్య, విజయకుమార్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. పెళ్లకూరు మండలంలోని తాళ్వాయిపాడు గ్రామం వద్ద మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు.

జాతీయ రహదారి పక్కన చెట్ల నరికివేతపై ఫిర్యాదు

తడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పూడికుప్పం జాతీయ రహదారి పక్కన భారీ వృక్షాలను కొందరు వ్యక్తులు నరికివేశారంటూ జాతీయ రహదారి అధికారులు పోలీసులకు, తహ సీల్దారుకు బుధవారం ఫిర్యాదు చేశారు. కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే చెట్లను నరికివేశారని, నిందితులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు లో పేర్కొన్నారు.

బాలగంగాధర్ తిలక్ జయంతి

చిల్లకూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధ వారం స్వాతంత్ర సమర యోధుడు బాలగంగాధర్ తిలక్ జయంతి నిర్వహించారు. తిలక్ చిత్రపటా నికి పూల మాల వేసినివాళు లర్పించారు. తిలక్ జీవిత చరిత్రపై విద్యా ర్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం అనసూయ, లావణ్య, ప్రజేంద్రరెడ్డి, మాధ వయ్య, చంద్రశేఖర్, లీల, మధుసూదనరావు, నాగభూష ణమ్మ, కామేశ్వరి, సుగుణమ్మ, రమణయ్య, సంధ్య, విద్యుల్లత, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడికి ఆర్థిక సాయం

గూడూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విందూరు గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు వినోద్‌కు పండరీ భజనకారుల ఆధ్వ ర్యంలో ఆర్థిక సాయం చేశారు. వినోద్ ఇటీవల రైలు ప్రమాదంలో గాయపడ్డాడు. బుధవారం పండరీభజన కళా కారుల ఆధ్వర్యంలో రూ.1.25 లక్షల ఆర్థిక సాయాన్ని అంద జేశారు. కార్యక్రమంలో కృష్ణ దాసు, పెంచలరెడ్డి, పెంచల దాసు, ప్రభాకర్, శ్రీకాంత్, లక్ష్మయ్య, మురళి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు

డక్కిలి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించినా ఉపేక్షించేది లేదని, ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు పెడతామని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. సంగనపల్లి చెరువు పోరంబోకు భూములను వైసీపీకి చెందిన ఓ నాయకుడు కబ్జా చేశారంటూ బుధవారం మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, డక్కిలి చంద్రారెడ్డి ఆధ్వర్యంలో సంగనపల్లి గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వైసీపీ నాయకుడు 2.5 ఎకరాల చెరువు పోరంబోకు భూమిని ఆక్రమించి నకిలీ పత్రాలు సృష్టించారని చెప్పారు. దీంతో తహసీల్దార్ సంగనపల్లి వద్దకు వెళ్లి క్షేత్రపరిశీలన చేశారు. రెవెన్యూ రికార్డులు పరిశీలించి భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం తహసీల్దార్ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకొంటున్నట్లు చెప్పారు. వీఆర్వోలు గ్రామాల్లో ఉంటూ ప్రభుత్వ భూములను పరిరక్షించాలని తగు సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి ఆక్రమార్కుల నుంచి భూములను స్వాధీనం చేసుకుంటామన్నారు.

నరాల సమస్యలపై అవగాహన కలిగిఉండాలి

గూడూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నరాల సంబంధిత సమస్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యూరాలజిస్ట్ డాక్టర్ సంఘమిత్ర అన్నారు. బుధవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నెల్లూరుకు చెందిన కిమ్స్ ఆస్పత్రి సహకారంతో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధి రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి రెండునెలలకోసారి ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకుంటూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటామన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ వ్యక్తిగత శుభ్రతను పాటించడం ద్వారా వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు జగదీష్, మోహన సాయిరూప, క్లబ్ సభ్యులు డాక్టర్ చంద్రహాస్, ఎంవీ.రమణయ్య, సోమిశెట్టి చెంచురామయ్య, మురళీరెడ్డి, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం


కరపత్రాన్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, జూలై 23(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. బుధవారం తొట్టంబేడు మండలం లింగమనాయుడుపల్లి, రౌతు సూరమాలలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధి కారులను కోరారు. ఇక తొట్టంబేడు మండల పరిధిలో మరన్ని పరిశ్రమలను తీసుకువచ్చి స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు రావిళ్ల మునిరాజానాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లం, పెనుమల్లం గ్రామాల్లో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ధనంజయలునాయుడు, బాబునాయుడు, నాగరాజునాయుడు, గిరినాయుడు, సీతాపతి ఆచారి, గురవారెడ్డి, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఏర్పేడులో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు

జాబ్ మేళాకు స్పందన


నియామకపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యువతకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. బుధవారం పిచ్చాటూరు పట్టణంలోని ఎంకేటీ మహల్‌లో నిర్వహించిన జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరిశ్రమలను తీసుకుచ్చేందుకు కృషి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. జాబ్ మేళాలో 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా 314మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా 224మంది ఉద్యోగాలకు ఎంపిక య్యారు. అనంతరం జాబ్‌మేళాలో ఎంపికైన వారికి నియామకపత్రాలను అందించారు. అనంతరం పిచ్చాటూరు టీచర్స్ కాలనీలో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎస్టీ కాలనీలో సుపరిపాలనలో ముందడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇళంగోవన్‌రెడ్డి, పద్దురాజు, వాసురెడ్డి, సెల్వరాజ్, గోవిందస్వామి, బుజ్జినాయుడు, సుమాంజలి, ఎంపీ డీవో మహ్మద్‌రఫీ, ఎంఈవో హేమమాలిని, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

దోపిడీ దొంగలను అరెస్టు చేయకుండా ఆరాధిస్తారా?


సమావేశంలో మాట్లాడుతున్న శంకర్ రెడ్డి

పిచ్చాటూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రజాధనాన్ని దోపిడీ చేసిన దొంగలని అరెస్టు చేయకుండా ఆరాధిస్తారా అని యాదవ కార్పొరేషన్ ఛైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం పిచ్చాటూరు పట్టణంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి హాజరైన వారిద్దరికీ స్థానిక టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. పిచ్చాటూరు సాయి బాబా గుడి సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సుపరిపాలన కరపత్రాలను పంపిణీ చేశారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ... నియోజకవర్గంలో టీడీపీ వర్గాల్లో నెలకొన్న విబేధాలను పక్కనబెట్టి సమష్టిగా ముందుకెళ్దామని పిలుపునిచ్చారు. త్వరలో కృష్ణ జలాలను అరణియార్ రిజర్వాయర్‌కు తీసుకొస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే హేమలత, సతీష్‌నాయుడు, తిరుమలరెడ్డి, పద్మనాభరాజు, మునస్వామియాదవ్, బాలరాజు, రామాంజులనాయుడు, యాచేంద్ర నాయుడు, గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ


వంట గది పరిశీలనలో శంకర్ రావు తదితరులు

రేణిగుంట, జూలై 23(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను తీరుస్తామని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ శంకర్‌రావు చెప్పారు. బుధవారం ఉదయం పాత విమానాశ్రయం సమీపంలోని గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహంలో గదులను, వంటశాలలను పరిశీలించారు. అక్కడ చదువుతున్న విద్యార్థులను వసతులపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలతోపాటూ వెదళ్లచెరువు గ్రామంలోని ఎస్టీకాలనీ పరిశీలిచానని చెప్పారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు హరిబాబు, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభురావు, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంఈవోలు ఇంద్రాదేవి, రంగనాథయ్య, సీఐ మంజునాథ్ రెడ్డి, ఎస్ఐ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం



ఏర్పేడు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేటలో కొలువై ఉన్న భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో బుధవారం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామిఅమ్మవార్ల కల్యాణం వైభవంగా జరిగింది. ముందుగా స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం కల్యాణోత్సవం ఘట్టం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రతాప్ రెడ్డి, కృష్ణప్ప మొదలి, శంకర్‌నాయుడు, సీతాపతి ఆచారి తదితరులు పాల్గొన్నారు.

పేదలను ధనికులను చేయడమే పీ4 లక్ష్యం

శ్రీకాళహస్తి, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 పథక ఆశయం పేదలను ధనికులను చేయడమే లక్ష్యమని తిరుపతి పార్లమెంటు టీడీపీ బీసీ విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి భాస్కర్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని 28వ వార్డులోని సచివాలయంలో బుధవారం పీ4 పథకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మునిరత్నంగౌడ్, గాండ్ల రవిశంకర్, సునీల్‌కుమార్, సచివాలయ సిబ్బంది, మహిళా సంఘాలు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు వసతులు కల్పించండి

నారాయణవనం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ద్రౌపది సమేత ధర్మరాజ స్వామి ఆలయ ఉత్సవాలలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పించాలని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. బుధవారం ఆయన నారాయణవనంలోఆగస్టు 1వ తేది శుక్రవారం ధ్వజారోహణంతో ప్రారంభం కానున్న ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. జడ్పీటీసీ సభ్యుడు సుమన్ కుమార్, ఆలయ ధర్మకర్త దేశప్ప రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తోపుడు బండ్ల వ్యాపారుల సంఘం నూతన కార్యవర్గం

తిరుపతి(ఆటోనగర్), జూలై23(ఆంధ్రజ్యోతి): తిరుపతి తోపుడు బండ్ల వ్యాపారుల సంఘం నగర కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నిర్మల్ ప్రసాద్, కార్యదర్శిగా పి.బుజ్జి, కోశాధికారిగా మురళి ఎన్నికయ్యారని సీఐటీయూ నగర అధ్యక్షుడు టి.సుబ్రమణ్యం తెలిపారు. నగర మహాసభలు ముగిసిన తర్వాత నూతన కమిటీని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యక్షులుగా రామాంజులు, వెంకటేష్ ఎన్నికయ్యారని తెలిపారు.

నేడు కేవీబీపురంలో సుపరిపాలనలో తొలిఅడుగు

కేవీబీపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కేవీబీపురంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని టీడీపీ సత్యవేడు నియోజకవర్గ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి ప్రారంభిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు తెలిపారు. యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు.

శాస్త్రోక్తంగా పార్వేట ఉత్సవం



శ్రీకాళహస్తి, జూలై 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై కొలువై ఉన్న వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి ఆలయ ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా బుధవారం పార్వేట ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మొదట స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అలంకార మండపంలో పలు రకాల అభిషేక పూజలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవమూర్తులను చప్పరం అధిష్ఠింపజేసి పుర విహారానికి తీసుకొచ్చారు. పట్టణంలో విహరిస్తున్న వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామికి భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టకు బదులు నవధాన్యాల సాగు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట ఎరువుకు బదులు నవధాన్యాలను సాగు చేయాలని ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం తెలిపారు. మండలంలోని నీర్పాకోటలో నాన్ పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్(ఎన్‌పీఎం) షాపును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలంలో పది గ్రామాల్లో సుమారు 100 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. ఎన్‌పీఎం షాపులో పసుపు, తెలుపు అట్టలు, లింగాకర్షక బుట్టలు, కషాయాలు, ద్రావణాలు, 200 కిట్ల నవధాన్యాల కిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి, జిల్లా యాంకర్ రవి చంద్ర ప్రసాద్, ఎన్ఎఫ్ఏ మధు పాల్గొన్నారు.

విద్యతో భవిష్యత్తు వికాసం

ఏర్పేడు, జూలై 23(ఆంధ్రజ్యోతి): పిల్లల భవిష్యత్తు మెరుగు పరిచి విద్యకు ప్రాముఖ్యతను ఇవ్వడంపై మండలంలోని నాగంపల్లి ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో బుధవారం అవగాహన కల్పించారు. తల్లిదండ్రుల్లో విద్యపై చైతన్యం పెంచి వారి భాగస్వామ్యంతో పిల్లల విద్యాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను జేసీఐ సంస్థ ప్రతినిధి డాక్టర్ జి.రమేష్‌బాబు, ఆర్.సీ.కే.రాజు వివరించారు. సామాజిక మార్పునకు విద్య ముఖద్వారంగా పని చేస్తుందన్నారు. బత్తినయ్యకాలనీ, ఊరందూరు ఎస్సీ కాలనీ, అక్కుర్తి ఎస్టీకాలనీ, పంగూరు, ఎల్లంపల్లి అరుంధతివాడ, చిన్నన్నపేట, అబ్బాబట్లపల్లివాసులు పాల్గొన్నారు.

వర్షాలకు గుంతలమయమైన గ్రామీణ రోడ్లు


దెబ్బతిన్న జీఎన్‌కండ్రిగ రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని శ్రీకాళహస్తి - తడ రోడ్డు పదవమైలు నుంచి జంబుగోళం వెళ్లే దారి గుంతలమయమైంది. దీంతో పది గ్రామాల ప్రజల ప్రయాణం దుర్భరంగా మారింది. పూసలపల్లి, జీఎన్‌కండ్రిగ, ఆర్ అనంత పురం గ్రామాల రోడ్లు కూడా వర్షాలకు దెబ్బతిన్నాయి. గుంతల కారణంగా వాహనాలు దెబ్బతింటున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఆదర్శ పాఠశాల అభివృద్ధికి నిధుల మంజూరు



కేవీబీపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరైనట్టు పాఠశాల ఏఈ వెంకటేశులు తెలిపారు. బుధవారం ఆదర్శ పాఠశాలలో గ్రీన్‌ఫీల్డ్ పార్కు నిర్మాణం నిమిత్తం ప్రిన్సిపాల్ సౌజన్య ఆధ్వర్యంలో కొలతలను సేకరించారు. ఆదర్శ పాఠశాలలో గతంలో పెండింగ్‌లో ఉన్న పనుల పూర్తికి రూ.15లక్షలు, పార్కు నిర్మాణానికి రూ.1.50లక్షలు మంజూరయ్యాయని, పనులను త్వరలో ప్రారంభిస్తున్నట్లు ఆమె తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు, తిరుపతి పార్లమెంట్ తెలుగురైతు అధ్యక్షుడు గోపీనాథ రెడ్డి, ఎస్ఎంసీ కమిటీ అధ్యక్షుడు సురేష్‌కరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు, ఐడీ కార్డుల వితరణ


క్రీడా దుస్తులు అందిస్తున్న దాత

కేవీబీపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమలపూడిలో ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 30మందికి బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిశేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో క్రీడా దుస్తులు, ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ఎంఈవోలు లక్ష్మీపతి, రవికుమార్, ఉపాధ్యాయుడు ప్రసన్న, ఎస్ఎంసీ కమిటీ ఛైర్మన్ శివశేఖర్, సీఆర్పీ సూపర్ తదితరులు పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి అరెస్టుపై వైసీపీ నిరసన

సత్యవేడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కాంలో ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్ అక్రమమంటూ సత్యవేడు పట్టణంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేష్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. స్థానిక గాంధీ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి కొంతసేపు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సుశీల్‌కుమార్‌రెడ్డి, బీరేంద్రవర్మ, నిరంజన్‌రెడ్డి, బెల్ట్ రమేష్, మస్తానమ్మ, రాజేష్, పళణి, మునిక్రిష్ణయ్య జోసఫ్, షాహుల్ తదితరులు పాల్గొన్నారు.

పరశురామేశ్వరుడి సేవలో డిప్యూటీ స్పీకర్



ఏర్పేడు, జూలై 23(ఆంధ్రజ్యోతి): తిరుపతి పర్యటన నిమిత్తం విచ్చేసిన డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు బుధవారం మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే సుధీర్, టీడీపీ మండల అధ్యక్షుడు నాగరాజునాయుడు, ఆలయ మాజీ ఛైర్మన్ గిరినాయుడు, ఈవో రామచంద్రారెడ్డి ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి స్వామిఅమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ డిప్యూటీ స్పీకర్‌కు గుడిమల్లం ఆలయ చరిత్రను వివరించారు. ఆలయ అర్చకుడు వంశీకృష్ణశర్మ ఆశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ చెంచయ్యనాయుడు, తహసీల్దారు భార్గవి, సీఐ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హరిహర వీరమల్లు విజయవంతానికి బైక్ ర్యాలీ



శ్రీకాళహస్తి, జూలై 23(ఆంధ్రజ్యోతి): పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రం విజయవంతం కావాలని జనసేన నాయకులు, ఆయన అభిమానులు పెద్దఎత్తున బుధవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు మీదుగా ప్రారంభమై నాలుగు మాడవీధులు, పానగల్, ఏపీ సీడ్స్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా జనసేన జిల్లా కార్యదర్శి కొట్టే సాయి మాట్లాడుతూ... మొగలుల పాలనలో జరిగిన ఆకృత్యాలు, హిందువులపై జరిగిన దాడులపై ఈ చిత్రం ఉంటుందన్నారు. కుమార్, మహేష్, చంద్ర, గోపి, పేట చంద్ర, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అడ్డుకుందాం



రైల్వేస్టేషన్‌లో పోస్టర్లతో అవగాహన

శ్రీకాళహస్తి, జూలై 23(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటారని ప్రగతి స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ రాజారెడ్డి అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా దినం జూలై 30వ తేదీని పురస్కరించుకుని జూలై 1 నుంచి 30వ తేదీ వరకు ప్రతి రైల్వేస్టేషన్‌లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా నిరోధంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఇందులో భాగంగా బుధవారం శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ వద్ద ప్రతి ఒక్కరికీ కరపత్రాలను పంచి మానవ అక్రమ రవాణా వల్ల కలిగే నష్టాలను, అక్రమ రవాణా పాల్పడుతున్న వారికి విధించే శిక్షలపై అవగాహన కల్పించారు. మానవ అక్రమ రవాణాపై టోల్ ఫ్రీ నెం.1098, 18001027222లకు సమా చారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ మాబుసుబాని, స్టేషన్ మాస్టర్ రమేష్ కుమార్ పండిట్, ఏఎస్ఐ మునికృష్ణ, కానిస్టేబుల్ నారాయణ, ఏపీ యానాది సంఘం అధ్యక్షుడు చందమామల కోటయ్య, మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హస్త కళాప్రాంగణాలు ఏర్పాటు చేయండి

శ్రీకాళహస్తి, జూలై 23(ఆంధ్రజ్యోతి): హస్తకళలను ప్రోత్సహించడానికి హస్త కళా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుమ్మడిపూడి దశరథాచారి కోరారు. తిరుపతికి విచ్చేసిన ఇన్‌చార్జి మంత్రిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి వేంకటేశ్వరస్వామి కొయ్య బొమ్మను బహూకరించారు.హస్తకళాకారులు ముడిసరుకు సేకరణలో ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి డిపోలను ఏర్పాటు చేయాలన్నారు. ఇక హస్త కళాకారులు తమ ఉత్పత్తులను విక్రయించుకు నేందుకు దేశవ్యాప్తంగా ఉన్న టీటీడీ కల్యాణ మండపాల్లో స్టాళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక కొయ్యబొమ్మలు, టెర్రకోటా, కలంకారీ, చేనేత కళాకారులకు బీమాసౌకర్యం కల్పించాలన్నారు.


మంత్రి సత్యప్రసాద్‌కు వెంకన్న కొయ్యబొమ్మను అందజేస్తున్న దశరథాచారి

ద్విభాషల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు చేపట్టాలి

అనిర్బన్ కుమార్ విశ్వాస్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 23 (ఆంధ్రజ్యోతి): ద్విభాషల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు చేపట్టాలని బెంగళూరులోని భారత హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని అధికార భాషా విభాగ ప్రాంతీయ కమిషనర్ అనిర్బన్ కుమార్ విశ్వాస్ పేర్కొన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. యూనివర్సిటీ వీసీ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ వెంకట నారాయణతో సమావేశమయ్యారు. పాలనా వ్యవహారాల్లో హిందీ అమలు తీరును అధికారులకు వివరించారు. హిందీ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్, హిందీ ఈ-టూల్స్ అప్లికేషన్స్, కంఠస్థ-2.0, అనువాద సాఫ్ట్‌వేర్ వాడకం, హిందీ టైపింగ్ శిక్షణ వంటి అంశాలను అధికారులు వివరించారు. దీనిపై అనిర్బన్ కుమార్ విశ్వాస్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఉత్తర ప్రత్యుత్తరాలు ద్విభాషల్లో చేపట్టాలన్నారు.